ఆదివారం

6 అక్టోబరు, 2024

# వార్త



## ప్రకృతి రూపం..

## శక్తి స్వరూపం



ఆడి పాడే 'బతుకమ్మ'

## విశ్వక్‌సేన్ జోడీగా

# ప్రియాంక మోహన్?



విశ్వక్‌సేన్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నాడు. ఇప్పటికే 'మెకానిక్ రాకీ' సినిమాను శరవేగంగా పూర్తి చేస్తున్న ఈ యంగ్ హీరో ఆ తరువాత కూడా పలు ఆసక్తికర చిత్రాలను లైన్‌లో పెట్టాడు. ఇందులో 'జాతిరత్నాలు' డైరెక్టర్ అనుదీప్‌తో ఓ సినిమా ఉంది. ఈ కాంబినేషన్‌లో సినిమా అనగానే ప్రేక్షకుల్లో ఆసక్తి ఏర్పడింది. అయితే ఈ సినిమాకు సంబంధించిన ఓ ఇంట్రెస్టింగ్ విషయం వినిపిస్తోంది. ఇందులో అందాల భామ ప్రియాంక మోహన్ కథానాయకు రాలిగా నటించనుందని సమాచారం. ప్రియాంక ఇటీవల నేచురల్ స్టార్ నాని సరసన 'సరిపోదా శనివారం' చిత్రంలో నటించి బ్లాక్‌బస్టర హిస్టర్ హిట్ అందుకుంది. దాంతో ఆమె విశ్వక్‌సేన్ జోడీ నటించనుందనే విషయం తెలిసి అభిమానులు ఎంతగానో సంతోషిస్తున్నారు. అయితే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చేవరకు సస్పెన్స్ తప్పదు మరి.

## తారాతీరం

సందీప్ కిషన్, దర్శకుడు త్రినాథరావు నక్కిన కాంబినేషన్‌లో రాబోతున్న చిత్రానికి టైటిల్ ఖరారు

# సంక్రాంతికి 'మజాకా' విడుదల!



చేశారు. ఈ మాస్ ఎంటర్టైనర్‌కి 'మజాకా' అనే పేరు నిర్ణయించారు. ఈ మధ్యే వచ్చిన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో సందీప్ కిషన్ అందరినీ ఆకట్టుకున్నాడు. 'ధమాకా' తరువాత నక్కిన త్రినాథరావు నుంచి వస్తున్న సినిమా కావడంతో ఈ చిత్రంపై మంచి అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాకి రాజేష్ దండా నిర్మాత. రాజేష్ దండా నుంచి వచ్చిన 'సామజవరగమన' మంచి విజయం సాధించింది. ఈ క్రమంలోనే 'మజాకా' కూడా విజయం సాధిస్తుందని అంచనా నెలకొన్నాయి.

ఇందులో రావురమేష్ కీలక పాత్ర పోషిస్తున్నారు. 'మన్మథుడు' ఫేమ్ అన్షు, రావు రమేష్‌కి జోడీగా నటిస్తోంది. ఈ సినిమాకి రచయిత: ప్రసన్నకుమార్ బెజవాడ.

ఈ సినిమా 2025 సంక్రాంతికి విడుదల కానున్నట్లు సమాచారం.

# ఆదివారం వార్త

**6 అక్టోబరు, 2024**

## మంచి ముత్యాలు

ప్రకృతికి విధేయులమై ఉన్నప్పుడే
దానిని మనం ఆజ్ఞాపించగలం.

- ఫ్రాన్సిస్ బేకన్

## విషయ విశేషం


ఆరోగ్య పంటలు.... 4

'సంఘీ'భావం....5

తెరవెనుక దారుణ దృశ్యాలు

కవర్ స్టోరీ..6

ప్రకృతి రూపం..
శక్తి స్వరూపం

హానికరంగా సౌందర్య సాధనాలు!....10

ఈవారం కవిత్వం..12

వట 'వృక్షరాజాయ' నమః

జ్ఞానులకు జ్ఞాని బుద్ధుడు...14

కథ.. 20

జీవితమే ఓ ఆట

సాహిత్యం.. 23

అంతర్జాల వలయంలో మేధావికాసం

ఆడి పాడే 'బతుకమ్మ'... 25

మిత్రుడుంటే సర్వస్వమున్నట్లే!...27

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం


వగైరా..వగైరా..


## తాజా వార్తలు

### సంతానలేమికి కారణాలు



అవీ ఇవీ అని లేదు, ప్రస్తుతం అన్ని నగరాల్లోనూ సంతాన సాఫల్యకేంద్రాలు పెరుగుతున్నాయి. కొత్తతరం దంపతుల్లోని సంతానలేమి సమస్యని అవి సూచిస్తున్నాయి. 'నగరాల్లోని వాతావరణ కాలుష్యం రణగొణ ట్రాఫిక్ సమస్యలేమైనా ఇందుకు కారణమవుతున్నాయా?' అన్న సందేహం వచ్చింది నార్వేలోని శాస్త్రవేత్తలకి. ఇందుకోసం డెన్మార్క్‌లోని 32-45 మధ్య ఉన్న ఐదులక్షల మంది మగవాళ్లూ..నాలుగులక్షలమంది మహిళల్ని 1995-2017 సంవత్సరాల మధ్య పరిశీలించారు. వాళ్లు నివసిస్తున్న ప్రాంతంలోని వాయుకాలుష్యం (పీహెచ్ 2.5 స్థాయులు), రణగొణ ధ్వనుల్నీ అంచనావేశారు. పద్దెనిమిదేళ్ల తర్వాత చూస్తే వీరిలో సుమారు 16వేలమంది పురుషులూ, 23వేల మంది స్త్రీలూ సంతానలేమితో బాధపడుతున్నట్టు తేల్చారు. వాళ్ల ఆరోగ్య పరిస్థితులూ, భాగస్వామితో గడిపే సమయం, పిల్లలు కావాలన్న అభీష్టం వంటివన్నీ పరిగణనలోకి తీసుకున్నాకే వారిపైన వాయు, శబ్దకాలుష్యాల ప్రభావాన్ని అంచనావేశారు. వాయుకాలుష్యం ఆడమగా ఇద్దరిలోనూ సంతానలేమిని సుమారు 24శాతం పెంచుతోందని తేల్చారు. శబ్దకాలుష్యం ప్రభావం పురుషులపైన పెద్దగా లేకున్నా ఆడవారిలో మాత్రం అది 14శాతం సంతానలేమికి కారణమవుతోందట.



మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com



# ఆరోగ్య పంటలు

## రూఫ్‌టాప్‌పైన తోట

కేరళలోని ఎర్నాకుళం జిల్లా పలరివట్టమ్‌లో ఉంటుంది రెనై మెడిసిటీ హాస్పిటల్. అక్కడ రోగులకు మందులతోపాటు తక్కువ ధరకే తాజా కూరగాయలు అందిస్తారు. పేదలకైతే ఉచితంగానే ఇస్తారు. రోగులకీ, సిబ్బందికీ వండే వంటకోసం అప్పటికప్పుడే కూరగాయలు కోసి తీసుకొస్తారు. అందుకోసం ఎనిమిది అంతస్తుల ఆసుపత్రి రూఫ్‌టాప్ మీద కాయగూరలు పండిస్తున్నారు రెనై సిబ్బంది. మూడువేల చదరపు అడుగుల స్థలంలో వారు చేస్తున్న సాగుతో, టొమాటో, బెండ, బీర, దొండ, గోరుచిక్కుడూ, పాలకూర, క్యాబేజీ..తదితర కాయగూరలు పండిస్తారు. అక్కడ క్యాంటీన్‌లో వంటకు ఉపయోగించగా మిగిలినవి సిబ్బందికీ, పేదలకీ ఉచితంగా పంచిపెడతారు. ఇంకా మిగిలితే ఫార్మసీలో మందులు కొనుగోలు చేసేవారికి నామమాత్ర ధరలకు అందిస్తుంటారు. ఇందుకోసం ప్రత్యేకంగా సిబ్బందినీ నియమించిన ఆసుపత్రి యాజమాన్యం...రోగులకు సేంద్రియ కాయగూరలతో వండిన ఆహారాన్ని అందించాలని రూఫ్‌టాప్ కిచెన్ గార్డెన్‌కు ఏర్పాటు చేసింది. వచ్చిన చెత్తని కంపోస్టు ఎరువుగా మార్చి, కిచెన్ గార్డెన్‌ను ఉపయోగిస్తారు. ఆ కూరగాయల తోటలో రకరకాల సమస్యలో రోజుల తరబడి ఆసుపత్రిలో ఉండే రోగులు ఆహ్లాదంగా గడిపేలా చూస్తుంటారు. ఒకవైపు రోగాల్ని నయం చేస్తూ మరోవైపు ఆరోగ్యాన్ని పెంపొందించే సేంద్రియ కూరగాయలు పండిస్తున్న ఈ హాస్పిటల్ ఆలోచన అదుర్స్ కదూ!



## దోమల్ని తరిమేస్తూ

కొచ్చీలోని జనరల్ హాస్పిటల్‌లో అడుగుపెట్టగానే చేపలు తిరగాడే నీటి తొట్టెలు..వాటిపక్కనే పైపుల్లో కూరగాయల మొక్కలు కనిపిస్తుంటాయి. నీళ్ల మడుగుల్లో, మొక్కలు ఉన్నచోట దోమలు విపరీతంగా ఉంటాయి. అసలే ఆసుపత్రి వాతావరణంలో దోమల బెడద కూడా ఉందంటే రోగులకు ఎంతో ఇబ్బంది అవుతుంది. అయితే ఆ సమస్యను పరిష్కరించాలనే జనరల్ హాస్పిటల్ సిబ్బంది ఆసుపత్రి పరిసరాల్లో హైడ్రోపోనిక్, ఆక్వాపోనిక్ విధానంలో కాయగూరల్నీ, చేపల్నీ పెంచుతున్నారు. పైగా దోమల లార్వాల్నీ గుడ్లనీ ఆహారంగా తీసుకునే గుప్పీ రకం చేపల్నే ఆ తొట్టెలో పెంచుతున్నారు. చేపలు పెరిగిన ఆ నీళ్లను హైడ్రోపోనిక్ సాగుకు వినియోగిస్తూ అక్కడి నుండి వచ్చే వృథా నీటిని మళ్లీ చేపల తొట్టెలోకి మళ్లిస్తున్నారు. ఈ విధంగా మొక్కలకి ఎరువుల అవసరం లేకుండా సాగు చేయడంతోపాటు నీటి వృథానీ అరికడుతున్నారు. దోమల బెడదనీ దూరం చేస్తున్నారు ఆసుపత్రి సిబ్బంది. పలు రకాల ఆకుకూరల్నీ, చేపల్నీ ఈవిధంగా సాగు చేయించి అక్కడ పని చేసే వారికి ఉచితంగా అందిస్తున్నారు. మరోవైపు పరిసరాల్నీ పరిశుభ్రంగా ఉంచుతున్నారు. దోమల సమస్యని సాగుతో భలేగా పరిష్కరించుకుంటున్నారు.

## వైద్యులే పండిస్తారు

తమ శాయశక్తులా కష్టపడి రోగుల్ని కాపాడుతుంటారు వైద్యులు. ఆ క్రమంలో విపరీతమైన ఒత్తిడిని ఎదుర్కొంటారు. వారు ఆ ఒత్తిడి నుంచి బయటపడటం ఎంతో అవసరం. బెంగళూరులోని 'నరటామా అండ్ ఎమర్జెన్సీ కేర్' హాస్పిటల్ అందుకోసం ఓ ఆలోచన చేసింది. ఆ ప్రభుత్వాసుపత్రి రూఫ్‌టాప్‌పైన డాక్టర్ల చేత మొక్కల పెంపకం చేపడుతోంది. నిత్యం ఎమర్జెన్సీ కేసులు వస్తుంటాయి ఆ ప్రభుత్వాసుపత్రికి. అక్కడ ఒకవైపు వైద్యుల కొరత..మరోవైపు రోగుల తాకిడి. ఈ క్రమంలో వైద్యులకు పనిభారం పెరిగిపోతోంది. దాంతో వారు విపరీతమైన ఒత్తిడికి గురవుతుండటంతో ఆ సమస్య నుంచి వారిని బయటపడేయడానికే ఉన్నతాధికారులు రకరకాల పువ్వులూ, పండ్లూ, కాయగూరలూ పెంచేలా అన్ని ఏర్పాట్లూ చేశారు. పచ్చని వాతావరణం ఒత్తిడిని తగ్గించి మానసికానందాన్ని పెంపొందిస్తుంది. కాబట్టి వైద్యులు డ్యూటీలో ఉండగానే ఏదో ఒక సమయంలో మొక్కల సంరక్షణ చూసుకుంటూనే పువ్వులూ, పండ్లూ, కాయగూరలూ కోయడం వంటివి చేసేలా చూస్తున్నారు. అక్కడ పండిన కాయగూరల్నీ, పండ్లనీ వైద్యులకు అందించి పువ్వులను మాత్రం స్థానిక ఆలయాలకు పంపిస్తుంటారు. ❑

## 'సంఘీ' భావం



# తెరవెనుక దారుణ దృశ్యాలు

ప్రపంచానికి వినోదం పంచే చలనచిత్ర రంగం తెరవెనుక భాగోతాలు కన్నీరు పెట్టిస్తున్నాయి. కులాల ఆధిపత్యం, లింగవివక్షత, ప్రాంతీయతత్వాలు విషాద గీతాలను ఆలపిస్తుంటాయి. కొందరు బాధితులు రోడ్డెక్కి తమ గోడు వినిపించుకోవడానికి తెగించి వచ్చినా వారికి జరిగిన న్యాయం ఏమాత్రం కనిపించడం లేదు. దీనితో తరతరాలుగా ఆవేదనను దిగమింగి చలనచిత్ర రంగంలో రాణించేందుకు చాలామంది కళాకారులు దుర్భరమైన జీవితాన్ని గడపడానికి అంగీకరిస్తున్నారు. కాస్టింగ్ కౌచ్ అన్నది దశాబ్దాల కాలం నుంచి వినబడుతూనే ఉంది. చలనచిత్ర రంగాన్ని ఏలిన ఎందరో అగ్రహీరోయిన్లు సైతం ప్రాథమిక దశలో అవమానాలు, ఆకృత్యాలను ఎదుర్కొన్నారు. ఒక్క సినిమా ఛాన్స్ ఇవ్వమని అడిగితే పడక సుఖం తరువాతే ఏదైనా అనే ఘనాపాటిలు చలనచిత్ర రంగంలో లెక్కకు మించి ఉన్నారు. తమ ప్రతిభను గుర్తించి సినిమాల్లో ఛాన్స్ పొందాలని ఆశించి ఎక్కడెక్కడి నుంచో వస్తున్న సత్తా కలిగిన యువతులకు సినిమా రంగంలో ఎదురయ్యే సమస్య తట్టుకోలేని విధంగా ఉంటోంది. మలయాళ చిత్రపరిశ్రమలో చీకటి కోణాలను హేమ కమిటీ నివేదిక వెల్లడించింది. వివక్ష, మాదకద్రవ్యాలు, మద్యపాన దుర్వినియోగం, వేతన వ్యత్యాసాల కంటే మహిళల పట్ల జరుగుతున్న ఆకృత్యాలను ఈ కమిటీ వెల్లడి చేసింది. అభ్యుదయ చిత్రాలకు వేదికగా పేరొందిన మలయాళ చిత్ర పరిశ్రమలో చీకటి కోణం అత్యంత దారుణంగా ఉందని జస్టిస్ హేమ పేర్కొన్నారు. సినిమా పరిశ్రమలో మహిళలకు అత్యంత ఘోరమైన దుర్మార్గ లైంగిక వేధింపులు ఉంటున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ సమస్యలపై పోరాటం చేసే మహిళలు తమ లైంగిక వేధింపులను బహిర్గతం చేయడానికి మాత్రం ఇష్టపడటం లేదని, భయపడుతున్నారని నివేదిక స్పష్టం చేసింది. 2017లో కదులుతున్న బస్సులో ఒక నటిని మరికొందరు నటులు, చిత్రపరిశ్రమలకు చెందిన వారు అత్యాచారం జరిపారు. ఈ కేసులో ప్రముఖ నటుడు దిలీప్, పల్సర్ సునీలు తదితరులు అరెస్ట్ అయ్యారు. ఈ ఘటనతో స్పందించిన ప్రభుత్వం జస్టిస్ హేమ, సినీ కళాకారిణి సి.శారద, వల్సలకు మారిలను సభ్యులుగా నియమిస్తూ విచారణకు ఆదేశించింది. అప్పటి నుంచి ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూ కమిటీ ఎట్టకేలకు రెండు సంవత్సరాలకు 2019 డిసెంబరులో నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. నివేదికను వెల్లడించే విషయంలో కూడా అనేక ఒత్తిడులు ఎదురయ్యాయి. కొందరు హైకోర్టు వెళ్లి స్టే సాధించారు. అనంతరం కొందరిని రక్షించడానికి నివేదికను పదేపదే సవరిస్తూ వచ్చారు. కేరళ చలనచిత్ర రంగానికి చెందిన సంఘం అమ్మ సభ్యులు ఈ నివేదిక వల్ల సమస్యను ఎదుర్కొన్నారు. దీనితో అధ్యక్ష కార్యదర్శులు, 17 మంది కార్యవర్గ సభ్యులు రాజీనామాలు సమర్పించాల్సిన పరిస్థితి వచ్చింది. జస్టిస్ హేమ విచారణ ప్రారంభించినప్పుడు చాలామంది బాధితులు ముందుకు వచ్చి తమ సమస్యలను చెప్పుకోవడానికి భయపడ్డారు. తమను వేధించిన వారిలో అగ్రశ్రేణి నటులు ఉండటం, చిత్రపరిశ్రమపై పట్టు సాధిస్తున్న డైరెక్టర్లు, సాంకేతిక వర్గ నిపుణులకు వ్యతిరేకంగా తమ గోడు వినిపిస్తే అవకాశాలు తగ్గిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. చిత్రసీమలో నిలదొక్కుకునేందుకు ఇప్పటికి పడిన కష్టాలకు అదనంగా మరో సమస్యను కొనితెచ్చుకోవడానికి కళాకారిణిలు సిద్ధంగా లేరని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. ఇలాంటి సమస్య ఏ ఒక్క రాష్ట్రానికో కాదు దేశవ్యాప్తంగా అన్ని చిత్రపరిశ్రమల్లో ఉంది. బాలీవుడ్‌లో కూడా ఈ సమస్య అధికంగానే ఉంది. కొన్ని సందర్భాల్లో నటీమణులు రోడ్డెక్కి తమ గోడు వినిపించే ప్రయత్నం చేశారు. అయితే వారికి సరైన న్యాయం జరగకపోగా ఉన్న అవకాశాలు సన్నగిల్లి పరిశ్రమ వదిలిపెట్టాల్సి వచ్చింది. తెలుగు పరిశ్రమలో సుమారు ఆరేళ్ల క్రితం ఒక నటి ఏకంగా నడిరోడ్డుపై దుస్తులు విడిచి అర్ధనగ్నంగా నిరసన వ్యక్తం చేసింది. కొందరు సీనియర్ నటీమణులు 'మీ టూ' అన్న నినాదంతో తమకు జరిగిన అన్యాయాన్ని బయటపెట్టారు. ఈ మధ్యకాలంలో కొందరు ద్వితీయశ్రేణి నటీమణులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై కేసు నమోదు కావడంతో అతనిని అరెస్ట్ కూడా చేశారు. ఇలా ఒకరిద్దరిపై కేసులు నమోదు అయినా వారు కోర్టు నుంచి బెయిల్ పొంది తిరిగి చిత్రసీమలో కొనసాగుతున్నారు. అయితే వీరి నుంచి ఇబ్బందులు ఎదుర్కొన్న మహిళలు మాత్రం పరిశ్రమను వదిలిపెట్టి వెళ్లిపోయారు. సినీ పరిశ్రమలో ఎవరికి వారే స్వతంత్రులు కావడంతో సంఘాలు, కమిటీలు దోషులపై చర్యలు తీసుకునే పరిస్థితి లేదు. ఎవరిమీద అయినా ఫిర్యాదు వస్తే వారిని ప్రశ్నించేలోపే అగ్ర కథానాయకులు, నిర్మాతలు దర్శకులు రంగప్రవేశం చేసి సమస్యను పక్కదారి పట్టిస్తున్నారు. ఈ లైంగిక వేధింపులకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో దోషులు బాధితులకు ఎదురుతిరుగుతున్నారు. దీనితో ఎవరు చెబుతున్నది నిజమో అర్థం కాని అయోమయ పరిస్థితి ఏర్పడుతోంది. లైంగిక వేధింపుల సమస్య ఒక్క సినిమా రంగంలోనే కాదు దాదాపుగా ప్రతి కార్యాలయంలోను, పరిశ్రమలోను కనిపిస్తూ ఉంటుంది. లైంగిక వేధింపులకు గురయ్యే యువతులు, మహిళలు ఉద్యోగం వదులుకోవడం కాని, గత్యంతరం లేకపోతే సర్దుకుపోవడం వంటి విధానాలను ఆశ్రయిస్తున్నారు. ఒక సినీనటి ఇంటర్వ్యూ ఇస్తూ లైంగిక వేధింపులకు లొంగితే చెడిపోయిందని, తిరగబడితే బరితెగించిందని వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసింది. లైంగిక వేధింపుల నివారణకు సమగ్రమైన చట్టం తీసుకురావడంతో పాటు మహిళల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

# ప్రకృతి రూపం.. శక్తి స్వరూపం

**ఈ సంవత్సరం అక్టోబర్ 3వ తారీకు నుంచి దసరా మొదలుకదా. అక్టోబరు 3 నుంచే ఎందుకు మొదలు అంటారా ఎందుకంటే ఆ రోజు ఆశ్వయుజ శుద్ధపాడ్యమి కనుక. అంటే ఈ రోజు అమ్మవారు ఆవిర్భవించిన రోజు గనుక. ఆ రోజునుంచి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజులు ఆవిడ మహిషాసురుడు అనే రాక్షసుడితో యుద్ధం చేసి అతనిని సంహరించింది. ఈ తొమ్మిది రోజులూ దేవీ నవరాత్రులని అమ్మవారిని పూజిస్తారు. పదవరోజు అమ్మవారు రాక్షసుడిని సంహరించిన విజయోత్సవ వేడుకలు విజయదశమిగా చేసుకుంటారు.**




అంటే ఇది శక్తి ఆరాధనకు ప్రాధాన్యమిచ్చే పండుగ. అమ్మవారు ఆవిర్భవించింది అంటారు, వెంటనే రాక్షసుడిని చంపిందంటారు..ఇదేమీ మాకర్థం కావటం లేదు, విపులంగా చెప్పండి అంటున్నారా. మర్చిపోయానర్రా, మీరంతా ఇంగ్లీషు మీడియాలు కదా, తెలుగు కథలు తెలియవులే. సరే, చెప్తా వినండి.

పూర్వం మహిషాసురుడు అనే రాక్షసుడు వుండేవాడు. అతనికి మరణం లేని జీవనం కావాలనీ, ఎల్లకాలం తనే అన్నిలోకాలనూ పరిపాలించాలనీ గొప్ప కోరిక వుండేది. ఈ కాలంలో మనమంతా మంచి ఉద్యోగాలు సంపాదించటానికి బాగా చదివి, పరీక్షలెలా రాస్తున్నామో, ఆ కాలంలో ఏమన్నా సాధించాలంటే ఏళ్ల తరబడి దేవుళ్ల కోసం తపస్సు చేసి వరాలు పొందేవారు. మహిషాసురుడు కూడా తన కోరిక నెరవేర్చుకోవటానికి మేరుపర్వతం మీదకి వెళ్లి అనేక వేల సంవత్సరాలు బ్రహ్మదేవుణ్ణి గూర్చి తపస్సు చేశాడు. కొన్నివేల సంవత్సరాల తర్వాత బ్రహ్మదేవుడు ప్రత్యక్షమయి ఏం వరం కావాలో కోరుకోమన్నాడు. మహిషాసురుడు కోరుకున్నాడు. ఏమని? నేను అమరుణ్ణి కావాలి. నాకు మరణం లేని జీవితాన్ని ప్రసాదించు అని. అప్పుడు బ్రహ్మదేవుడు, 'మహిషాసురా..పుట్టిన ప్రాణి గిట్టక తప్పదు..గిట్టిన ప్రాణి మరల పుట్టక తప్పదు. జనన మరణాలు సకల ప్రాణికోటికి సహజ ధర్మాలు. ప్రకృతి విరుద్ధమైన నీ కోరిక తీర్చటం అసంభవం. కనుక, నిన్ను సంహరించ టానికి మృత్యువుకు ఒక మార్గం విడిచిపెట్టి, మరే వరమైనా కోరుకో' అన్నాడు. అప్పుడు మహిషాసురుడు, 'విధాతా..అల్పమైన కోరికలకు ఈ మహిషాసురుడు ఆశపడడు. సరే..ఆడది నా దృష్టిలో అబల..ఆమెవల్ల నాకే ప్రమాదమూ రాదు. కనుక, పురుషుడి చేతిలో నాకు మరణం రాకుండా అనుగ్రహించు' అని కోరాడు. బ్రహ్మదేవుడు ఆ వరాన్ని మహిషాసురునికి అనుగ్రహించి అంతర్ధానమయ్యాడు.

ఇంకేముంది!!? బ్రహ్మదేవుని వరాల వలన గర్వితుడైన మహిషాసురుడు దేవతలతో ఘోరమైన యుద్ధం చేసి వారిని ఓడించి ఇంద్రపదవి చేపట్టాడు. దేవేంద్రుడు త్రిమూర్తులతో మొర పెట్టుకొన్నాడు. మహిషుని దురాగతాలు అంతం చెయ్యాలని. మహిషాసురుని దుష్కృత్యాలకు త్రిమూర్తులలో రగిలిన క్రోధాగ్ని ప్రకాశవంతమైన తేజంగా మారింది. ఆ తేజమంతా ఒక చోట ఏరి ఒక స్త్రీ రూపమై వెలిసింది. శివుని తేజము ముఖముగా, విష్ణు తేజము బాహువులుగా, బ్రహ్మతేజము పాదములుగా కలిగి మంగళమూర్తిగా అవతరించిన ఆమె 18 బాహువులను కలిగి ఉంది. ఆమెకు శివుడు శూలాన్ని, విష్ణువు చక్రాన్ని, ఇంద్రుడు వజ్రాయుధాన్ని, వరుణ దేవుడు పాశాన్ని, బ్రహ్మదేవుడు అక్షమాల, కమండలాలని, హిమవంతుడు సింహాన్ని వాహనంగా ఇచ్చారు. ఆ దేవి ఇలా సర్వదేవతల ఆయుధాలని సమకూర్చుకొని మహిషాసురుని సైన్యంతో తలపడి భీకరమైన పోరు సల్పింది. మహిషాసురుని తరపున పోరు సల్పుతున్న అతని సేనానాయకులను, సేవలని సంహరించి తరువాత మహిషాసురునితో యుద్ధం చేసింది. ఆ యుద్ధములో ఆ దేవి వాహనమైన సింహమూ శత్రువులను చీల్చి చెండాడింది. దేవితో తలపడిన అసురుడు మహిష

**కవర్ స్టోరీ**

**పి.యస్.యమ్.లక్ష్మి**

రూపము, సింహరూపము, మానవ రూపాలతో భీకరముగా పోరాడి చివరకు తిరిగి మహిష రూపంలో దేవి చేతిలో హతుడైనాడు. ఈ విధంగా అప్పటి నుండి అమ్మవారు మహిషాసుర మర్దనిగా అందరిచే కొనియాడబడింది. మహిషుని సంహరించిన తిథి దశమి విజయ దశమి పర్వదినంగా ప్రజలంతా పండగ చేసుకోసాగారు. ఈ నవరాత్రులకి సంబంధించి ఇంకో గాథ కూడా ఉంది. కృతయుగంలో సుకేతనుడు అనే రాజు తన జ్ఞాతులచే రాజ్యభ్రష్టుడై భార్యతో కూడా అడవులపాలై కష్టాలు పడుతుండగా అంగీరసుడు అనే ఋషి అతనికి నవరాత్రిపూజా విధులను ఉపదేశించాడు. అతడు మహర్షి చెప్పిన విధంగా పూజ చేసి మరల తన ఐశ్వర్యమును పొందాడనే కథ ఉంది. ఈ కథను బట్టి కొందరు ఆ దేవి దుర్గ, లక్ష్మి, సరస్వతి ప్రతిరూపంగా భావించి, వీరిలో ఒక్కొక్క దేవిని మూడేసి రోజులు పూజిస్తారు. తొమ్మిది రోజులూ ఆ దేవతలను పూజించుటకు వీలుకాకపోతే చివరి రోజైన నవమి నాడు విద్యాపీఠమున పుస్తకాలను పెట్టి ఆ రోజు ముగ్గురు దేవతలని పూజిస్తారు.

## ఆలయాలలో

నవరాత్రి ఉత్సవాలలో, ఆలయాలలో అమ్మవారికి రోజుకు ఒక అలంకరణ చేస్తారు. అయితే ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా అమ్మవారి పేర్లు ఉంటాయి. కొన్ని ప్రాంతాలలో మొదటి రోజు శైలపుత్రి, రెండవ రోజు బ్రహ్మచారిణి, మూడవనాడు చంద్రఘంటాదేవి, నాల్గవ రోజున కూష్మాండాదేవి, అయిదవ రోజున స్కంధమాత, ఆరవరోజున కాత్యాయినీ, ఏడవరోజున కాళరాత్రి, ఎనిమిదవ రోజున మహాగౌరి, తొమ్మిదవ రోజున సిద్ధిధాత్రిదేవిగా పూజిస్తారు. కొన్ని ప్రదేశాలలో పార్వతీదేవిని కనకదుర్గగా, మహాలక్ష్మిగా, అన్నపూర్ణగా, గాయత్రిగా, బాలాత్రిపుర సుందరిగా, రాజరాజేశ్వరిగా, మహిషాసుర మర్దినిగా ఆరాధిస్తారు. ఈ విజయ దశమికీ రామాయణానికీ, భారతానికీ కూడా సంబంధాలున్నాయి. త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు లంకకి వెళ్లేముందు శమీ వృక్షానికి పూజ చేసి వెళ్లాడని, అందుకే రావణుడి మీద విజయం సాధించాడని ఒక కథనం. పైగా రావణాసురుని సంహరించిన రోజు విజయదశమి. అందుకనే ఆలయాలలో రావణాసురుని నిలువెత్తు విగ్రహాన్ని తయారు చేసి, సాయంత్రం దానిని దహనం చేస్తారు.ఇంక భారత కథనానికి వస్తే అజ్ఞాతవాసానికి వెళ్లేముందు పాండవులు తమతమ ఆయుధాలను ఒక జమ్మి చెట్టుమీద దాచారని, అజ్ఞాతవాసం పూర్తయిన తర్వాత విజయదశమి రోజు వాటిని తిరిగి తీసుకున్నారనీ అంటారు. ఆ సమయంలో ఇంద్రుడు పాలపిట్ట రూపంలో వాటిని కాపాడాడనే కథనం కూడా వుంది. అంత ప్రాముఖ్యం వహించిన జమ్మిచెట్టును ఈ రోజు పూజించి, దాని ఆకులను బంగారమని అందరికీ శుభాకాంక్షలతో పంచే ఆచారం కూడా కొన్ని ప్రాంతాలలో వున్నది. శమీవృక్షం (జమ్మి)





సువర్ణవర్షం కురిపిస్తుందని శాస్త్రాల్లో ఉంది. విజయదశమి రోజున పూజలు అందుకొన్న జమ్మి చెట్టు ఆకులను ఇంట్లోని పూజాస్థలంలో, ధనస్థానంలో నగదు పెట్టెల్లో ఉంచుతారు. దీనివల్ల ధనవృద్ధి జరుగుతుందని నమ్మకం. దక్షిణాది రాష్ట్రాలలో శమీ పూజలతోబాటు విజయదశమి రోజు పాలపిట్ట దర్శణశణనం కూడా శుభ సూచకమనే నమ్మకం వుంది.

## ఆయుధ పూజ

ఈ నవరాత్రులలోనే ఆయుధ పూజ కూడా చేస్తారు. మహాశక్తి రాక్షసులతో యుద్ధం చేసి గెలిచినందుకూ, పాండవులు ఆయుధాలు తిరిగి తీసుకున్న రోజుకు గుర్తుగానూ ప్రజలు తాము ఉపయోగించే పనిముట్లని ఆరోజు పూజిస్తారు.

## సాంప్రదాయాలు

ఈ రోజులలో కొందరు వివిధ దేవుళ్ల వేషధారణ చేసి ఇంటింటికి తిరిగి గృహస్తులు ఇచ్చినది పుచ్చుకోవడం వృత్తిగా ఆచరిస్తారు. వీటికి దసరా వేషాలు లేదా పగటి వేషాలు అంటారు. అలాగే బుడబుక్కలవారు, గంగిరెద్దులవాళ్లు, పిట్టల దొరలు ఈ పండుగ రోజులలో ఇంటింటికీ తిరిగి గృహస్తులు ఇచ్చిన దానాలతో జీవితం గడిపేవారు. వాళ్లందరితో, చుట్టు పక్కాలతో ఇళ్లూ, ఊళ్లూ మహాసందడిగా వుండేవి.

మా చిన్నతనంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను వెంట పెట్టుకొని విద్యార్థుల అందరి ఇళ్లకు వెళ్లి సంభావన పుచ్చుకోవడం మామూలే. నేను కూడా వెళ్లాను. ఆ సమయంలో వెదురుకర్రతో చేసి రంగు కాగితాలతో అలంకరించిన బాణాలు విద్యార్థులు పట్టుకుని అయ్యవారి వెంట వస్తారు. విద్యార్థులు, 'ఏదయా మీ దయా మామీద లేదు, ఇంత సేపుంచుటా ఇది మీకు తగునా..అయ్యావారికి చాలు అయిదు వరహాలు, పిల్ల వాళ్లకు చాలు పప్పు బెల్లాలు' అంటూ రాగయుక్తంగా పాడుకుంటూ అయ్యవారి వెంట వెళ్లేవాళ్లు. గృహస్తులు అయ్యవారికి ధనరూపంలోనూ, పిల్ల వాళ్లకు పప్పుబెల్లం రూపంలోనూ కానుకలు ఇచ్చేవారు. కొత్తగా వివాహం జరిగిన ఇంటి ఆడపడచుని భర్తతో సహా ఇంటికి ఆహ్వానించి అల్లుడికీ కూతురికీ నూతన వస్త్రాలు కానుకలు ఇచ్చి సత్కరించడం కూడా అలవాటే.

## స్వాతంత్ర్య సాధనలో

స్వతంత్ర్యపోరాట సమయంలో ఈ దసరా ఉత్సవాలు సామాజిక ఉత్సవాలుగా మారాయి. 1930లో కలకత్తా మేయర్‌గా ఉన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ సర్వజన పూజను



ముందుండి నడిపించారు. జాతీయోద్యమ ప్రచారానికి, స్వదేశీ వస్తువుల ప్రోత్సాహానికి ఈ ఉత్సవాలు వేదికగా మారాయి. తెలుగు రాష్ట్రాలలో దసరా ఎలా జరుపుకుంటారో చూద్దామా.. తెలంగాణ ప్రజలు దసరా సమయంలో బతుకమ్మ ఉత్సవాలు చేస్తారు. బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్రంలో ఆశ్వయుజ మాస శుద్ధ పాడ్యమి నుండి తొమ్మిది రోజులపాటు జరుపుకుంటారు. నవరాత్రి మొదటి రోజున బతుకమ్మను పూలతో అలంకరించి తొమ్మిది రోజులు స్త్రీలంతా ఒక చోట చేరి ఆటపాటలతో ఆనందిస్తారు. చివరి రోజున బతుకమ్మను నిమజ్జనం చేసి పండుగ చేసుకుంటారు. ఇది తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన పండుగ. ఈ రోజుల్లో ఆడపడచులు అందరూ అత్తవారింటి నుంచి కన్నవారింటికి చేరుకుంటారు. ఈ వారం రోజులలో వీరు రోజూ పువ్వులతో బతుకమ్మలు చేసి, దాని మీద పసుపు గౌరిని పెట్టి, ప్రతీ సాయంత్రం దాని చుట్టూ తిరుగుతూ ఆడుతారు. ఆ తరువాత దగ్గరలో ఉన్న జలాలలో నిమజ్జనం చేస్తారు.



## కరీంనగర్

దసరా సమయంలో కరీంనగర్ వాసులు అకాడాగా నిర్వహిస్తా రు. ఇక్కడ గనిలో పనిచేసే కార్మికులు ఈ పండుగను గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా చేసుకుంటారు. క్షత్రియుల ఆయుధ విన్యాసాలు పోలిన విన్యాసాలను ప్రదర్శించడం ఇక్కడి సంప్రదాయం. ఇక్కడి నెహ్రూ స్టేడియంలో నరకాసుర వధ ఘట్టాన్ని ప్రదర్శించడంతో పండుగ మొదలౌతుంది. హనుమాన్ అకాడా, దుర్గా అకాడాల లాంటి దేవతల రూపాలతో ఇనుప బెల్టు, త్రిశూలం మొదలైన ఆయుధాలను పట్టుకొని విన్యాసాలు చేస్తూ ఊరంతా తిరుగుతూ ప్రజలను ఆనందింపచేస్తారు. కర్రసాము ఈ ప్రదర్శనలో భాగమే. జమ్మి ఆకులను ఒకరికొరు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పుకుంటారు.

## విజయవాడ భేతాళ నృత్యం

విజయవాడలోని ప్రధాన ఆలయాలలో బెజవాడ కనకదుర్గమ్మ ఒకటి. ఇది ఆంధ్ర రాష్ట్రం అంతటా ప్రాముఖ్యం ఉన్న ఆల యం. నవరాత్రి తొమ్మిది రోజులు వైభవంగా ఉత్సవాలు నిర్వహించి విజయదశమి నాటికి కృష్ణా నదిలో తెప్పోత్సవం చేస్తారు. తర్వాత విజయవాడ నగర పోలీసులు అమ్మవారిని పాతబస్తీలో ఊరేగిస్తారు. 1వ టౌన్ పోలీసు స్టేషను వద్దకు రావడంతో ఊరేగింపు ముగుస్తుంది. దసరా సందర్భంలో చివరి రోజు ప్రభలు ఊరేగింపుగా వస్తాయి. ఈ ప్రభలలో భేతాళ నృత్యం ప్రదర్శిస్తారు. ఈ భేతాళ నృత్య ప్రదర్శన విజయవాడ ప్రత్యేకత.

## వీరవాసరం ఏనుగుల సంరంభం

పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరంలో దసరా సమయంలో సుమారు వంద సంవత్సరాల నుండి ఏనుగు సంబరాలు జరపడం ఆచారం. దసరా మొదటి రోజున ఏనుగు గడిలో భేతాళుడిని నిలబెడతారు. భేతాళుడంటే వయసైన బ్రహ్మచారి. తొమ్మిది రోజులు భేతాళుడు నియమ నిష్టలతో అమ్మవారి పూజలు నిర్వహిస్తాడు. వెదురు కర్రలు గడ్డి కొబ్బరిపీచుతో చేసిన ఏనుగును అంబారీతో అలంకరిస్తారు. తెల్లని వస్త్రానికి రంగుల లతలు, కాగితంపూలు, తగరంతో అలంకరణలు చేసి అంబారీ చేస్తారు. అలాగే చిన్న ఏనుగును తయారు చేసి అలంకరించి చివరి రోజున బోయలచే ఊరేగింపుగా తీసుకు వెళతారు. ఈ ఊరేగింపులో పిల్లలను ఏనుగు కింద నుండి దాటిస్తారు. అలా దాటిస్తే పిల్లలు రోగ విముక్తులై ఆరోగ్యంగా ఉంటారని విశ్వసిస్తారు. రాత్రి ఆరు గంటలకు ప్రారంభించే ఈ ఉత్సవం తెల్లవారి ఆరు గంటల వరకు సాగాక చెరువు కట్టకు చేరుకొని అక్కడ ముగిస్తారు.

## విజయనగరం సిరిమాను

విజయనగరంలో దసరా సమయంలో గజపతుల ఆడపడుచైన పైడితల్లికి పూజలు చేస్తారు. ఈ దేవికి దసరా వెళ్లిన తరువాత మొదటి మంగళవారంనాడు జాతర జరుపుతారు. ఈ ఉత్సవంలో భాగంగా పూజారిని సిరిమాను ఎక్కించి అమ్మవారి గుడి ఉన్న మూడు లాంతర్ల సెంటర్ నుండి కోట వరకు మూడుసార్లు ఊరేగిస్తారు. ఈ ఉత్సవం చూసేందుకు చుట్టుపక్కల పల్లెల నుండి ప్రజలు ఎడ్లబండ్లలో మూడు రోజులు ముందుగా వచ్చి రోడ్డు పక్కన గుడారాలు వేసుకుని ఉత్సవం చూసి ఆనందిస్తారు. అడవిలో నుండి ఒక నిటారైన చెట్టును నరికి తీసుకువచ్చి మొదలు భాగాన్ని లాగుడు బండికి కట్టి చివరి భాగంలో ఊయల కట్టి అందులో పూజారిని కూర్చోపెట్టి ఊరేగింపుగా కోటకు తీసుకు వస్తారు.

## వీపన గండ్లలో రాళ్లయుద్ధం

కర్నూలు జిల్లాలోని వీపనగండ్లలో దసరా సమయంలో రాళ్లయుద్ధం చేసుకుంటారు. దసరా రోజున సాయం వేళలో ప్రజలు కాలువ ఒడ్డున కాలువకు అటూ ఇటూ చేరి కంకర రాళ్లను గుట్టగా పోసుకుని ఒకవైపు రామసేన, ఒకవైపు రావణ సేనగా ఊహించి రాళ్లను విసురుతూ యుద్ధం చేసుకుంటారు. ఇది అధర్మంపై ధర్మం యుద్ధం చేసినట్లు భావిస్తారు. దీనిని వాళ్లు రామ-రావణ యుద్ధంగా అభివర్ణిస్తారు. ఎంత ఎక్కువగా దెబ్బలు తగిలితే అంత బాగా ఉత్సవం జరిగినట్లు విశ్వసిస్తారు. ఇదే సమయంలో ఇదే జిల్లాలోని దేవరగట్టు గ్రామంలో కూడా బన్ని ఉత్సవం జరుగుతుంది. మాలమల్లేశ్వరస్వామి విగ్రహాన్ని తమ గ్రామానికి తీసుకు వెళ్లేందుకు ఓ వర్గం, తమ గ్రామంలోనే ఉండేలా చూసుకునేందుకు మరో వర్గం ఎదురుపడి ఇనుప తొడుగులు తొడిగిన వెదురు కర్రలతో విపరీతంగా కొట్టుకుంటారు. ఎంత గాయాలైనా పట్టించుకోరు. అనాదిగా జరుగుతున్న ఈ రక్తపాతానికి అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు, ప్రభుత్వం ఎంతగా ప్రయత్నించినా సఫలం కాలేకపోతున్నారు.



## సంగారెడ్డిలో రావణ దహనం

మెదక్ జిల్లా సంగారెడ్డిలో దసరా సందర్భంలో తొమ్మిది రోజులు దేవిని ఆరాధించి చివరి రోజున రావణ కుంభకర్ణ బొమ్మలను దగ్ధం చేస్తారు. ఈ బొమ్మలను వారు బాణసంచాతో తయారు చేసి అగ్నిబాణాలతో దగ్ధం చేస్తారు. రామ, లక్ష్మణ వేషధారులు బాణాలను సంధిస్తారు. ఈ ఉత్సవం మునిసిపల్ గ్రౌండులో నిర్వహిస్తారు. చుట్టుపక్కల గ్రామాల నుండి వేలకొలది భక్తులు హాజరై ఉత్సవానికి వన్నె తీసుకు వస్తారు.

## బందరు శక్తి పటాలు

కృష్ణా జిల్లాలో ఉన్న రేవు పట్టణం బందరులో దసరా సందర్భంలో శక్తి పటాల ఊరేగింపు నిర్వహిస్తారు. దాదాపు నూరు సంవత్సరాల క్రితం కలకత్తా నుండి బొందిలీలకు చెందిన సైనికుడు మచిలీపట్నం ఈడేపల్లిలో కాళీమాత ప్రతిష్ట చేశాడు. అప్పటి నుండి దసరా సమయంలో శక్తి ఆలయం నుండి శక్తి పటాన్ని పట్టుకుని పురవీధులలో ఊరేగింపుగా తీసుకు రావడం ప్రారంభం అయింది. ఊరేగింపు సమయంలో పటాన్ని వీపుకు కట్టుకుని ముఖాన్ని అమ్మవారి భయంకర ముఖాకృతిని తగిలించుకుని నాట్యమాడుతూ వీధులలో తిరుగుతారు. తొమ్మిది రోజులు ఇలా అన్ని వీధులలోని ఇంటింటికీ తిరుగుతారు. వారి వారి ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు వారి మొక్కుబడులు తీర్చుకుంటారు. పటం ధరించిన వారు డప్పు శబ్దానికి అనుగుణంగా వీరనృత్యం చేస్తూ భయంకర రాకృతిలో ఉన్న రాక్షసుని సంహరిస్తున్నట్లు అభినయిస్తారు. చివరి రోజున మచిలీపట్నం కోనేరు సెంటరుకు తీసుకువచ్చి జమ్మి కొట్టడంతో ఉత్సవం ముగుస్తుంది.



## ఒంగోలు కళారాలు

దసరా సమయంలో ప్రకాశం జిల్లా ఒంగోలు ఉత్సవాలలో భాగంగా కళారాలను ఊరేగిస్తారు. ఈ కళారాలను దసరాల సమయానికి చక్కగా అలంకరించి సిద్ధం చేస్తారు. కళారాలంటే పెద్ద ముఖాకృతి. ఇక్కడ కాళికాదేవికి, మహిషాసుర మర్దినికి, నరసింహ స్వామికి కళారాలున్నాయి. వీటికి ఈ తొమ్మిది రోజులు విశేషంగా పూజలు చేసి ఒక్కోరోజు కొన్ని కళారాలకు ఊరేగిస్తారు. కళారాన్ని బండి మీద ఎక్కించి అటూ ఇటూ పట్టుకోవడానికి అనువుగా కొయ్యలను అమర్చి వాటి సాయంతో కళారాన్ని అటూ ఇటూ ఊపుతూ డప్పుల మోతలతో ఊరేగింపు నిర్వహిస్తారు. కళారం వెనుక భాగంలో అమ్మవారి ప్రతిరూపంగా చీరెను ధరించి వీరనృత్యం చేస్తూ కళారాన్ని ఉగ్రంగా ఊపుతూ ఉంటాడు. ఇలా కళారాన్ని ఊరి నడి మధ్యకు తీసుకువచ్చి అక్కడ రాక్షస సంహార ఘట్టాన్ని ప్రదర్శిస్తారు.

## ఇతర రాష్ట్రాల్లో..

### తమిళనాడు

ఇక్కడ వైభవంగా అమ్మవారి పూజతో పాటు ఈ నవరాత్రులకి ఏర్పాటు చేసే బొమ్మల కొలువు ప్రసిద్ధికెక్కింది.

### మైసూరు

మైసూరులో జరిగే దసరా ఉత్సవాలు చాలా ప్రసిద్ధికెక్కాయి. అక్కడ రాజుల కాలం నుంచీ భారీగా జరిగే దసరా ఉత్సవాలు, ఏనుగుల ఊరేగింపు చూడటానికి ఎక్కడెక్కడినుంచో ప్రజలు వస్తారు.

### బెంగాల్

కలకత్తాలో దుర్గపూజ పేరుతో జరిగే ఈ ఉత్సవాలలో తొమ్మిది రోజులు అమ్మవారిని పూజించి, అనేక భగవత్సంబంధిత కార్యక్రమాలు నిర్వహించి, కాళికా మాతని దర్శిస్తారు. చివరి రోజు నదీ తీరంలో కుమారీ పూజలు చెయ్యటం వీరి ప్రత్యేకత. చివరి రోజు దుర్గామాతని హుగ్లీ నదిలో నిమజ్జనం చేస్తారు.

### గుజరాత్

దసరా సమయంలో గుజరాతీయులు పార్వతీదేవి ఆరాధన చేస్తారు. ఇంటింటా శక్తిపూజ చేయడం గుజరాతీయుల ఆచారం. ఇంటి గోడల మీ శ్రీ చక్రాన్ని, త్రిశూలాన్ని, శక్తి ఆయుధాన్ని పసుపుతో చిత్రించి పూజిస్తారు. ఆ గుర్తుల సమీపంలో పొలం నుండి తీసుకువచ్చిన మట్టితో వేదిక తయారు చేసి దానిపై బార్లీ, గోధుమ విత్తనాలను చల్లి, దానిపై మట్టికుండ పెట్టి, దానిని నీటితో నింపి, పోకచెక్క వెండి లేక రాగి నాణెం వేస్తారు. ఆ మట్టికుండను వారు దేవిగా భావిస్తారు. దానిని వారు కుంభీ ప్రతిష్ట అంటారు. అష్టమి రోజున యజ్ఞం నిర్వహించి దశమి రోజున నిమజ్జనం చేస్తారు. అమ్మవారి వద్ద పెట్టిన ప్రమిదను గుడిలో సమర్పిస్తారు. తరువాత పౌర్ణమి వరకూ జరిగే గర్బా అనే ఉత్సవాలలో స్త్రీలు ఉత్సాహంగా పాల్గొంటారు.

### ఒరిస్సా

ఒరిస్సా పౌరులు కటక్ కళాకారులు రూపొందించిన దుర్గామాత విగ్రహాలను వీధి వీధిలో ప్రతిష్ఠిస్తారు. స్త్రీలు మానికలో వడ్లు నింపి లక్ష్మీదేవిగా భావించి పూజలు నిర్వహిస్తారు. దీనిని వారు మాన బాన అంటారు. దశమి రోజు రావణ దహనం కూడా చేస్తారు. ఇలా ఎన్నో ప్రదేశాలలో ఎన్నో రకాలుగా జరుపుకునే ఈ దసరాలో అందరూ చేసేది అమ్మవారి ఆరాధనే. ❑

**మనం నిత్యం వాడుకునే సౌందర్య సాధనాలు లేదా కాస్మొటిక్స్‌తో మహిళలకు ప్రత్యేక అవ్యాజమైన అవి భాజ్య ప్రేమలు పెనవేసుకుంటున్నాయి. అందంగా కనిపించాలనే మిషతో మనం అనేక రకాలైన కాస్మొటిక్స్‌ను విచక్షణారహితంగా, అవగాహన లేమితో అధిక మోతాదులో వాడడం మనకు అనాదిగా అలవాటు అయ్యింది.**

# హానికరంగా సౌందర్య సాధనాలు!

డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి

ఏ శుభకార్యానికి హాజరు కావాలనుకున్న గంటల పాటు మేకప్ చేసుకోవడం, మార్కెట్‌లో ముంచెత్తుతున్న అనేక రకాల కాస్మొటిక్స్‌ను ముఖమంతా పూసుకోవడం డిజిటల్ యుగపు మహిళలకు దురలవాటుగా మారింది.

ప్రపంచవ్యాప్తంగా పుట్టుకొస్తున్న కాస్మొటిక్స్ తయారు చేసే కంపెనీలు ప్రసార మాద్యమాల్లో గుప్పిస్తున్న వ్యాపార ప్రకటనల బుట్టలో పడిపోయి ఒకే రోజులో అందంగా మారుతామనే దురాశతో వేల రూపాయలు వెచ్చించి వివిధ రకాల కాస్మొటిక్స్‌ను ఖరీదు చేసుకొని చర్మానికి పూసుకుంటూ లేదా బ్యూటీపార్లర్ వెళ్లి మన ముఖాన్ని శరీరాన్ని వారి చేతుల్లో పెట్టి మన ఆరోగ్యాన్ని, అందాన్ని శాశ్వతంగా పాడు చేసుకుంటున్నామని నిపుణులు హెచ్చరించడం విని కూడా పెడచెవిన పెట్టడం నవ్య వనితలకు అలవాటు అయ్యింది. ఇలాగే కొన్ని ఏండ్లపాటు కాస్మొటిక్స్‌ను విచక్షణారహితంగా వాడడం వల్ల సహజ చర్మ ఆయిలీ ధర్మాలు, అత్యవసర విటమిన్లు, ఖనిజ లవణాలను కోల్పోయి తీవ్ర అనారోగ్యాలు, చర్మవ్యాధులు, ప్రమాదకర రోగాలు కలుపుతాయని తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

## సౌందర్య సాధనాలు- చూపుపై దుష్ప్రభావాలు

కాస్మొటిక్స్‌ను ముఖానికి రాసుకున్నపుడు సూక్ష్మచర్మరంధ్రాలు శాశ్వతంగా మూసుకుపోయి మొటిమలు, గడ్డలు, నల్లని రంధ్రాలు, చికాకు లేదా ఇరిటేషన్, చర్మ ముడతలు పలు రకాలైన ప్రమాదకర దుష్ప్రభావం కలుగుతాయి. మన చర్మధర్మానికి విరుద్ధమైన కాస్మొటిక్స్ వాడినపుడు మన చర్మం అతిగా పొడి పారడం లేదా ఆయిలీరూపంలోకి మారడం కూడా గమనించారు. సౌందర్య సాధనాల్లో వాడే ఫార్మాల్డిహైడ్/ పారాబెన్స్ లాంటి రసాయనాలతో చర్మ కేన్సర్ ప్రమాదం కూడా పెరగవచ్చుని హెచ్చరిస్తున్నారు.



## నేత్రాలపై దుష్ప్రభావాలు

కొన్ని రకాలైన కాస్మొటిక్స్ వాడడం వల్ల ఎలర్జీ చర్యలు జరుగుతాయి. ఈ ప్రతికూల చర్యలతో ఎలర్జిక్ డెర్మటైటిస్, ఫొటో డెర్మటైటిస్, కాంటాక్ట్ యుర్టికారియా లాంటి దుష్ప్రభావాలను



చూపిస్తున్నాయి. కాస్మొటిక్స్‌లో ఎక్కువకాలం నిలువ ఉంచడానికి వీలుగా వాడే ప్రిజర్వేట్యూవ్స్‌తో పాటు సువాసన వెదజల్లడానికి వాడే ఫ్రాగ్రెన్స్ రసాయనాల మోతాదు మించితే తీవ్ర చర్మవ్యాధులు, చర్మరంగులు మారడం, ఎర్రబారడం కూడా కలుగుతాయి.


## లెడ్ పాయిజనింగ్

కొన్ని రకాలైన లిప్‌స్టిక్స్ (పెదవులకు పూసుకునే సాధనాలు) వాడడం వల్ల పెదవుల చర్మం రంధ్రాలు మూసివేయబడడంతో పాటు దాని తయారీలో వాడే విషప్రభావం కలిగిన సీసం లేదా లెడ్ వల్ల శరీరంలోకి ప్రవేశించి బ్రెయిన్ డ్యామేజ్ ప్రవర్తనలో ప్రతికూల మార్పులు, కండరాల సమన్వయ లోపం, వినికిడి లోపం, కంటి జబ్బులు, అధిక రక్తపోటు లేదా బిపీ కూడా కలుగుతాయని తెలుసుకొని మసలుకోవాలి.

## ఇతర దుష్ప్రభావాలు

సౌందర్య సాధనాలను పరిమితులకు మించి లేదా వ్యాపార ప్రకటనలు చూసి మోజులోపడి వాడితే చర్మ దురదలు, రంగు మారడం, ముఖచర్మం సున్నితత్వాన్ని కోల్పోవడం, త్వరగా ముసలితనపు ఛాయలు రావడం లాంటి ప్రతికూల ప్రభావాలు కలుగుతాయి.

కొన్ని రకాల కాస్మొటిక్స్ వాసనలు పీల్చితే శ్వాసకోశ కణజాలం డ్యామేజ్ కావడంతో పాటు లంగ్ కేన్సర్ కూడా కలిగే అవకాశం ఉంటుంది.



### కాస్మొటిక్స్ వాడుకునే సన్మార్గాలు

మన చర్మానికి తగిన కాస్మొటిక్స్‌ను చర్మవైద్య నిపుణుల సిఫార్సు మేరకు మాత్రమే వాడాలి. చర్మాన్ని తేమగా ఉంచడానికి వాడే సరైన మాశ్చరైజర్లు మన చర్మ సహజ లక్షణాలను కాపాడుతాయి. సౌందర్య సాధనాలు వాడిన తర్వాత ఇంటికి చేరగానే తప్పనిసరిగా మేకప్‌ను పూర్తిగా తొలగించాలి. ఒకరు వాడే కాస్మొటిక్స్‌ను మరొకరు వాడకూడదు. సూర్యకిరణాల నుంచి చర్మాన్ని రక్షించుకోవడానికి సరైన 'సన్‌స్క్రీన్ లోషన్స్' లేదా తగిన మాశ్చరైజర్స్ వాడడం మంచిది. ప్రతిరోజు మేకప్ చేసుకుంటూ పలు రకాల కాస్మొటిక్స్ వాడిన వారికి దుష్ప్రభావాలు తప్పనిసరిగా కలుగుతాయని తెలుసుకోవాలి. సౌందర్య సాధనాల వాడడాన్ని తగ్గించుకోవడం, తప్పనిసరి అయినపుడు వైద్యుల సలహాలతో వాడడం ఉత్తమమార్గం. సహజ అందాన్ని మింగడానికి సిద్ధంగా ఉన్న కాస్మొటిక్స్‌కు దూరంగా, మన శరీర చర్మాన్ని శుభ్రంగా ఉంచుకుంటూ చిరునవ్వుల సహజ సౌందర్య సాధనాన్ని విరివిగా వాడుతూ మన చర్మ ఆరోగ్య కాంతులను, ముఖ సౌందర్యాన్ని మనమే కాపాడుకుందాం. ❑

# అ'సాదా'రణం

**ఒకప్పుడు** పాలకులంటే ప్రజలకు ఆదర్శంగా నిలిచేవారు. ప్రత్యేకంగా ప్రజాప్రతినిధులు నీతినిజాయితీగా జీవించి, నేటికీ వారి అడుగుజాడల్లో పయనించేలా ఎన్నో సన్నివేశాలు, సందర్భాలు మనకు కనిపిస్తూనే ఉన్నాయి. ఈనాటికీ వాటి గుర్తించి గుర్తుచేసుకుంటూ, వారిని మెచ్చుకుంటూ ఉంటాం. నేటి పాలకుల్లో అలాంటి నిజాయితీ, నిబద్ధత సన్నగిల్లుతోంది. ప్రజాప్రతినిధుల్లో ధనం, పదవీకాంక్ష కోసం ఎంతటి నీచరాజకీయాలకైనా దిగజారుతున్నారు. అందుకే మనం గతంలో పాలించిన ప్రజాప్రతినిధులు, పాలకులు పాలించిన నిబద్ధతత, నైతికవిలువల గురించి నెమరు వేసుకోవడం అవసరం. ఇలాంటి సన్నివేశమే ఒకటి లాల్‌బహదూర్ శాస్త్రి జీవితంలో జరిగింది. ఆరోజు చివరి రైలు ఆ స్టేషన్ ఫారమ్ నుండి వెళ్లిపోయింది.



తదుపరి రైలు రేపు ఉదయం వరకు రాదనే విషయం తెలియక ఒక వృద్ధురాలు రైలు కొరకు ఎదురుచూస్తూ ఫ్లాట్‌ఫారమ్‌పై కూర్చొని ఉంది. అది గమనించిన ఒక కూలీ ఆ తల్లిని అడిగాడు. 'అమ్మా, మీరు ఎక్కడికి వెళ్తున్నారు?' అని దానికి సమాధానంగా ఆ పెద్దావిడ 'నేను నా కొడుకు వద్దకు ఢిల్లీ వెళ్లాలి' అని చెప్పింది. జవాబుగా కూలీ 'ఈ రోజు ఇక రైలు లేదు అమ్మా' అని చెప్పాడు. అందుకు ఆ స్త్రీ నిస్సహాయంగా చూసింది. అయితే ఆమెకు వెయిటింగ్ రూమ్‌లో ఆశ్రయం కల్పించాడు. అంతటితో ఆగకుండా ఆ కూలీ ఆమె కొడుకు గురించి అడగగా ఆమె తన కొడుకు రైల్వేలో పనిచేస్తున్నాడని తల్లి బదులిచ్చింది. పేరు చెప్పండి, సంప్రదించడానికి మేము ప్రయత్నిస్తాం అన్నాడు ఆ కూలి. 'మా అబ్బాయిని అందరూ లాల్ బహదూర్ శాస్త్రి' అని పిలుస్తారు అని ఆ అమ్మ బదులిచ్చారు. ఆ స్త్రీమూర్తి కొడుకు అప్పుడు ఇండియన్ రైల్వేస్ కేంద్ర కేబినెట్ మినిస్టర్. ఒక్క క్షణంలో స్టేషన్ మొత్తం దద్దరిల్లింది. వెంటనే సర్రున్న కారు వచ్చింది. వృద్ధురాలు ఆశ్చర్యపోయింది.

ఈ విషయం లాల్‌బహదూర్ శాస్త్రికి ఏమీ తెలియకుండా భారతీయ రైల్వే అన్ని ఏర్పాట్లు చేసింది. ఆవిడ ఢిల్లీలో తన కొడుకుని కలిసిన తర్వాత కొడుకుని ఈవిధంగా అడిగింది..'అబ్బాయి, నీవు రైల్వేలో ఏం పని చేస్తావు' అని. ఇదే కదా సింప్లిసిటీ అంటే. ❑

# వట 'వృక్షరాజాయ' నమః



ఆదివారం కవిత్వం

జుట్టు జడలు కట్టి యుండు కానీ సన్యాసి కాదు
ఎర్రెర్రని పిల్లలుండు కానీ మనిషి కాదు
సామెతలో అదే కదా మర్రిచెట్టు
ఆధ్యాత్మికత ఆధునికత ఉనికిపట్టు
నీరిమ్మని అడగదు-నీడనిస్తుంది
పెంచుకోమని కోరదు.. జాగా కావాలని నోరిప్పదు
కోట బురుజుపైనా మలుపులోనైనా
ఊడలే గోడలు.. నిలబెట్టే జాడలు
అద్భుతమూలిక- విషాలని వదలగొట్టే ఔషధాల ఏలిక
విత్తనాలు తారలు.. పండ్లు పగడాలే!
చెట్ల కింది రచ్చబండలు/ మనుషులనీ కలిపే వంతెనలు
ఊడల అమ్మఒడి/ పాఠాలను నేర్పించే ప్రకృతి కాంత బడి!
ప్రతీ కొమ్మా అమ్మే-ప్రతీ రెమ్మా అమ్మే
వటపత్రశాయితో మురిపాలు
రోగాలను తరిమికొట్టే మర్రిపాలు
వేలకు వేల ఊడలతో ఎదుగుతుంది
బోన్సాయిగానూ ఒదుగుతుంది.
పసివాళ్లకి ఊయలగా ఊతమిస్తుంది
యుక్తవయసులో మంచమై హాయినిస్తుంది
వృద్ధాప్యంలో చేతికర్రగా చేయూతనిస్తుంది
కట్టెగా కట్టె కాలేంత వరకూ సాయమందిస్తుంది
ఔషధాల ఖని గని/ వట వృక్షానికిదే వందనం.. అభివందనం
మర్రిచెట్టు-మర్రిచెట్టే!
మరే చెట్టూ ఈ చెట్టు ముందు తీసికట్టే!

**- తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి**

## హృదయ శకలం

గుండె పగిలి రాలిపడిన
అక్షరాశ్రువులు/ ఒక్కొక్కటిగా కోటి
శకలాలై / శిథిల సౌధలా మారిపోయేను.
హృదయం ముక్కలై/ రుధిరం సిరాయై
గుండె ఘంటం లిఖించేను
విషాద గీతికల భావాలు/ ఆ గీతికలు
ఆలపించిన/ మౌనశోకం అయ్యేను
ఒక గంభీర సంద్రం/ ఆ సంద్రాన్ని
కదిలిస్తే/ ఉప్పొంగుతాయి కన్నీటి
వీచికల్లా/ లావా నిండిన కెరటాలు..
అప్పుడే కోరుకుంటుంది/ భంగపడ్డ
హృదయం/ఒక అనునయ ఏకాంతం.

**- నాగముని.యం**

## ఆదర్శ పాఠశాల విద్యార్థుల ఘనత



ఆదర్శ పాఠశాల బాలలం
ఆదర్శంగా నిలిచే విద్యార్థులం ॥2॥
శారదాంబ ఒడిలో పసికూనలం
సమగ్రతను వెదజల్లే కుసుమాలం ॥2॥
॥ఆదర్శ॥

చల్లనైన చదువులమ్మ బడిలోన
మిలమిల మెరిసే చక్కని నయనాలతో
కిలకిలమను పక్షులవలె నవ్వులతో
గలగల పారు నదీ నడకలతో
విద్యార్జన చేసి మేంవిద్యావంతులై వెలుగొందుతాం
॥ఆదర్శ॥

కుల మతాల భేద భావాన్నొదిలేస్తాం
కుటుంబమై ప్రేమతోడ(మెదిలేస్తాం) మెలగుతాం
క్రమశిక్షణతోటి అడుగు వేసేస్తాం
కన్నవారి కలలను సాకారం చేస్తాం ॥2॥
పాఠశాల పేరు మేం నిలబెట్టి తీరుతాం
॥ఆదర్శ॥

కళలలో, క్రీడలలో, జ్ఞానార్జనలో ముందుండి
మా ప్రాంత ఘనతను మేం చాటుతాం
అనునిత్యం శ్రమించి(ఆంధ్ర, తెలుగు) పరిమళాలను
అవని నిండ వెదజల్లి అందరి మది నిండుతాం
॥2॥ ॥ఆదర్శ॥

**- బి.నాగలక్ష్మి**

## అనుమాండ్ల సిద్ధాంత గ్రంథాలు



తెలంగాణ సాహితీ కేదారాలలో పసిడి పంటలు పండించిన ప్రముఖులలో ఒకరు ఆచార్య అనుమాండ్ల భూమయ్య. కరీంనగర్ జిల్లా (వెదురుగట్ట)లో పుట్టిన వీరు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. చేశారు. వరంగల్ పిజి సెంటర్‌లో ఎం.ఫిల్, కాకతీయ విశ్వవిద్యాలయం (వరంగల్)లో పిహెచ్‌డి చేసారు. లెక్చరర్, రీడర్, ప్రొఫెసర్‌గా ఉద్యోగించి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి, బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయాలకు వైస్‌చాన్సలర్‌గా పని చేసారు. పద్యకవి, విమర్శకులు, మహాకవి సి.నారాయణరెడ్డి అంతటి తెలంగాణ కవియని పేరు తెచ్చుకున్న వారు. భాగవతములోని గజేంద్రోపాఖ్యానములో జనులందరు ఒకరిపక్షం వహించగా, వీరు మరొకపక్షము వహించి, మెప్పించిన వైవిధ్యద్రష్ట. సింహాసన ద్వాత్రింశిక అను సంస్కృత గ్రంధానికి తెలుగు అనువాదం మొదటిదికాగా, భావ కవిత్వోద్యమ వైతాళికుడుగా పేరుగాంచిన నాయని సుబ్బారావు 4 కవిత్వ కృతుల పరిశీలన భూమయ్య రెండవ గ్రంథం. అందువలనే సిద్ధాంతద్వయం అన్నారు గ్రంథకర్త. 8 అధ్యాయాలలో గోపరాజు తెలుగుసేతలోని రచనా వైభవం, విశిష్టత తెలుపబడింది. ఏడు అధ్యాయ రచయితల అభిప్రాయాలు సేకరించబడినాయి. పైన పేర్కొనట్లు విద్యార్థులకు ఆసక్తిగలవారికి బాగా పనికి వస్తుంది గ్రంథం.

**(ఆచార్య అనుమాండ్ల భూమయ్య, రచన: ఎ.భూమయ్య, వెల: రూ 250, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్)** **– కూర చిదంబరం**

## శ్రీకృష్ణతత్వానికి దర్పణం 'రాధామాధవం'



బాల్యం నుండి భగవాన్ శ్రీకృష్ణుని యందు తనకు గల భక్తిని ప్రేమగా పెంచుకుని తన జీవన సారధి ఆ కృష్ణుడే అని గాఢంగా నమ్మిన లలిత 'రాధామాధవం' పేరిట ఓ పొత్తం వెలువరించారు. 'నిన్ను మించిన గొప్ప ప్రేమికుడు ఈ లోకంలోనే కాదు..ఈ సమస్త విశ్వంలో వుండడని నా ప్రగాఢ నమ్మకం..నేను నీసఖిని..కృష్ణసఖిని' అంటూ ప్రేమ లేఖను సంధిస్తారు లలిత. 'నీపాదాల కింద నలిగే పువ్వునైతే చాలురా ఈ జన్మకిది ధన్యమని మురిసిపోయే కృష్ణదాసినిరా!' అంటూ పరవసించి ఆలపిస్తారు. ఆధ్యాత్మిక దారిలో పయనిస్తున్న కవయిత్రి భగవద్గీతలోని కొన్ని శ్లోకాలను ఎంపిక చేసుకుని వాటి తాత్పర్యం..వివరణ సవిస్తరంగా ఆవిష్కరించారు. 'లలితా గోపాలం' శీర్షికన పొందు పరచిన రచనలన్నీ రాధాకృష్ణుల నడుమ ఇలా జరిగి వుంటుందని లలిత ఊహించి అల్లిన కథనాలే. రాధా, మాధవుల మధ్య పెనవేసుకున్న ప్రేమానురాగాలు, పవిత్రబంధం, విరహావేదన, భక్తి తత్పరత రేఖామాత్రంగా లలిత స్పృశించిన సృజన యిది. 'పద్యావళి, కవితాదర్పం, లేఖలు, లలితా గోపాలం, రాధామాధవం, ఆధ్యాత్మిక దారి' శీర్షికన వెలువరించిన రచనలు యివి. చదువరులకు శ్రీకృష్ణతత్వం కొంతవరకు ఒంటబడ్తుందని నా విశ్వాసం.

**(రాధా మాధవం, రచన: లలిత: వెల: రూ 120, ప్రతులకు: గోదావరి ప్రచురణలు, 7:154, కొత్తకాలనీ, కరపా మండలం, కాకినాడ జిల్లా)**

**– రమణ వెలమకన్ని**

# పుస్తక సమీక్ష

డా॥ కొండపల్లి నీహారిణి, తెలుగు కవయిత్రిగా, రచయిత్రిగా సృజనాత్మక ప్రతిభతో వాస్తవ జీవన మానవీయ విలువలను ప్రతిబింబింపచేయగల చైతన్యశీలి. సమకాలీన సమాజంలోని మహిళల జీవితాలలోని వేదన, సంఘర్షణలు, కుటుంబ సంబంధ బాంధవ్యాలలో ఒడిదుడుకులు వివిధ దృక్కోణాలలో కథలుగా రచయిత్రి దర్శింపచేస్తారు. తెలంగాణ మాండలికంలో, గ్రామీణ


## 'ఘర్షణ' నీహారిణి కథాసంపుటి



నేపథ్యంలో చుట్టూ ఉన్న సమాజాన్ని నిశితంగా పరిశీలించగలగడం, అన్యాయ, అసమానతలవల్ల స్పందించడంతో ఈ కథలు ఆలోచంప చేస్తున్నాయి. కవయిత్రి, కథా రచయిత్రిగా ప్రస్థానంలో కథల ఇతివృత్తాల ఎంపిక, ముగింపులో ప్రత్యేకత ద్యోతకమవుతోంది. కవిత్వం రాసినా, వ్యాసాలయినా, యాత్రాకథనాలయినా, పరిశోధనలు అయినా, ఏం రాసినా అనుభూతులను రంగరించి రాయగల రచయిత్రి ప్రతిభ ప్రశంసనీయం. ఇందులోని 19 కథలలో సగంపైగా మహిళల జీవన చిత్రాలుగా ఆకట్టుకొంటున్నాయి. 'కొత్త చూపు' కథలో స్త్రీవాదం, 'ఆడోళ్ల కష్టాలు', వారి గోసలు ఎవ్వరు పట్టించుకోరమ్మ' అనిపించడంలో కొంత స్పష్టమైంది. గతిస్తున్న తరాన్ని ఆరాధిస్తూ, కొత్త తరాన్ని ఆ పునాదులపై వికసింపచేస్తూ రెండు తరాల మనుషుల కుటుంబ విలువల 'ఘర్షణ' అద్భుతంగా దర్శింపచేస్తోంది. **(ఘర్షణ, రచన: డా॥ కొండపల్లి నీహారిణి, వెల: రూ 150, ప్రతులకు: కె.వేణుగోపాలరావు, 559, శ్రీశ్రీహోమ్స్, అల్మాసాగూడా, హైదరాబాద్)** **– యర్రమిల్లి**

లక్షశ్లోకాల మహాభారత కావ్యంలో శ్రీకృష్ణుడి పాత్ర విశిష్టమైంది. మహాభారతంలో ఎక్కడా ఉల్లేఖించబడని 'బర్బరిక' కథ జనపదాలలో వాడుకలో వున్న లెక్కలేనన్ని పాత్రలలో 'బర్బరిక' పాత్ర ఒకటి. నేటి రాజస్థాన్‌లోని సికార్ జిల్లాలో

## కృష్ణుడి కథనం- 'బర్బరికం'



ఖాటో అన్న పల్లెలో బర్బరికకు దేవాలయం ఉంది అక్కడ బర్బరికను 'ఖాటోశ్యాం' అని పూజిస్తారు. రూపసింహచవ్హాన్ నర్మదా కన్వర్ రాజదంపతులు 1033లో బర్బరికకు దేవాలయం నిర్మించారు. 1720లో అది జీర్ణోద్ధారణ చేయబడింది. శ్యామబాబాగా పూజలు చేస్తున్నారు. స్థలపురాణం ప్రకారం మహాభారత యుద్ధంలో పాల్గొనడానికి వచ్చిన బర్బరిక వల్ల భారతయుద్ధం ఉద్దేశమే పాడైపోతుందన్న సంగతి అర్థం చేసుకొని కృష్ణుడు బర్బరిక తలను దానంగా కోరుతాడు. బర్బరిక గురువు విజయ 'గురుదక్షిణగా నీ తల ఇవ్వమంటాడు'. గురువు పాదాల చెంత తలపెట్టగా అప్పుడు కృష్ణుడు తన నిజరూపం చూసి నీ త్యాగం గొప్పదని పొగడి అతని కోరిక (యుద్ధవీక్షణ) తీరుస్తాడు శ్రీకృష్ణుడు. జర విడిచిన బాణానికి కృష్ణుని అస్తమయంతో నవల ముగుస్తుంది. విజయముని గురుత్వం విప్రశుతుడిని ఓడించడం మణికర్ణి ప్రేమను తిరస్కరించిన బర్బరిక బ్రహ్మచారిగా ఉండటం ఇలాంటి ఎన్నో కథలు ఈ నవలలో ఆకర్షిస్తాయి. **(బర్బరిక, రచన: కన్నడం: గురుపాద బేలూరు, అనుసృజన: వేలూరి కృష్ణమూర్తి, వెల: రూ 120, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్)** **– తంగిరాల చక్రవర్తి**

డాక్టర్ దేవరాజు మహారాజు

# జ్ఞానులకు జ్ఞాని బుద్ధుడు



**బుద్ధుడు చెప్పిన విషయాలు ప్రపంచవ్యాప్తంగా ఎంతో మందికి, ఎన్నో రకాలుగా స్ఫూర్తినిచ్చాయి. బుద్ధుడి స్ఫూర్తితోనే ఎంతోమంది తాత్త్వికులయ్యారు. సిద్ధాంతకర్తలయ్యారు. మేధావులయ్యారు. వీరు మాత్రమేకాకుండా బుద్ధుడు చెప్పిన ఒక సిద్ధాంతంతో చాలామంది శాస్త్రవేత్తలయ్యారు. పరిశోధకులయ్యారు.**

ఆయన చెప్పిన అనేక విషయాలలో ఈ ఒక్క సిద్ధాంత విశ్వవ్యాప్తంగా ప్రభావం చూపింది. అదేమంటే 'కార్యకారణ సిద్ధాంతం'. ఆ ఒక్క మాటతో ఆయన వైజ్ఞానికులకు వైజ్ఞానికుడయ్యాడు. ఏ కార్యం జరిగినా, దాని వెనక ఒక కారణం ఉంటుంది. ఆ కారణాన్ని అన్వేషించి, అర్థం చేసుకుంటేగాని దాన్ని నివారించడానికి మార్గాలు వెతుక్కోవచ్చు అన్నది బుద్ధుడి కార్యకారణ సిద్ధాంతం! ఎక్కడ ఏ ప్రగతీ లేని రోజుల్లో, మానవ మేధస్సు వికసించని దశలో, బుద్ధుడు సుమారు రెండున్నరవేల ఏళ్ల క్రితం ఆ విషయం చెప్పడం మామూలు విషయం కాదు. ఈ రోజు వైజ్ఞానిక ప్రపంచమంతా ఈ సూత్రం చుట్టే తిరుగుతూ ఉండడం మనం గమనించొచ్చు.

బుద్ధుడు ఏం చెప్పాడూ? 'ప్రపంచంలో దుఃఖం ఉంది. దానికి కారణముంది. కారణముంది కాబట్టి, నివారణ ఉంది. నివారణ ఉంది కాబట్టి అందుకు మార్గాలున్నాయి' అన్నాడు. దీనిమీద ఆధారపడి కారల్‌మార్క్స్ మరో సిద్ధాంతం చెప్పాడు. ఆయన ప్రపంచంలోని పేదరికాన్ని, అణచివేతను, అసమానతను గుర్తించాడు. ఆ విషయాన్నే తన సిద్ధాంతంగా చెప్పాడు. ప్రపంచంలో పేదరికం ఉంది. పేదరికం ఉంది కాబట్టి అసమానత, అణచివేత ఉన్నాయి. పేదరికానికి కారణాలు తెలుసుకుంటేనే, ఆ కారణాలకు నివారణలు తెలుసుకోవచ్చు. ఆ నివారణకు దారులే సమసమాజస్థాపన, క్రాంతి-విప్లవం అని వివరించాడు మార్క్స్! లోతుగా తరచి చూస్తే, మార్క్సిజం, బుద్ధిజం పునాదులపైనే నిర్మాణమైందని అనిపిస్తుంది.

నేటి ఆధునిక వైద్యశాస్త్రమైనా ఏం చెబుతుంది? ప్రపంచంలో రోగాలున్నాయి. రోగాలున్నాయి కాబట్టి ఆరోగ్య సమస్యలున్నాయి. అవి ఉండడానికి కారణాలున్నాయి. ఆ కారణాలు బాక్టీరియా, వైరస్‌లే కావచ్చు. వారసత్వ లక్షణాలే కావొచ్చు. మరింకేదైనా కావచ్చు. కారణాలేవైనా అందుకు నివారణలున్నాయి. ఆ నివారణలకు వేర్వేరు దారులున్నాయి. ఆ దారులేమిటి? చికిత్స, థెరపీ, ఆపరేషన్ వగైరా ఏదైనా కావొచ్చు. కార్యకారణ సిద్ధాంతం 16వ శతాబ్దంలో యూరోప్‌కు చేరినప్పుడు, అక్కడ ఏకన్, న్యూటన్, కెప్లర్, గెలీలియో వంటి మహాశాస్త్రవేత్తలంతా తయారయ్యారు. ఈ రకంగా చెప్పాలంటే భారతదేశం 'విశ్వగురువు' ఎప్పుడో అయిపోయింది. కాస్త చదువూ, జ్ఞానం, విజ్ఞత ఉన్నవారికి ఈ విషయం తెలుస్తుంది. అది లేనివారే ఇప్పుడీ దేశాన్ని కొత్తగా 'విశ్వగురువు'గా నిలబెడతామని బయలుదేరుతున్నారు. అది వారి అజ్ఞానాన్ని బయటపెడుతుంది.



భారతదేశం ప్రపంచానికి ఏమిచ్చిందీ అంటే బుద్ధుణ్ణి ఇచ్చింది. బుద్ధుడు ప్రపంచానికి ఏమిచ్చాడంటే కార్యకారణ సిద్ధాంతాన్నిచ్చాడు. ఎక్కడ ఏ ఆధారాలూ లేని రోజుల్లో ఏ పరిశీలనలు, ఏ పరిశోధనలూ జరగని రోజుల్లో బుద్ధుడు ఆ సిద్ధాంతాన్ని ఇచ్చాడంటే మాటలా? ఆయనకు జ్ఞానోదయమైందంటే ఇదే ప్రపంచానికి ఆయన

జ్ఞానాన్నిచ్చాడంటే ఇదే! ఆ ఒక్క సిద్ధాంత మీదే అన్న ఆధారపడి ఉన్నప్పుడు, వైజ్ఞానిక పరిశోధనలన్నీ ఇప్పటికీ ఆ సిద్ధాంతం మీదే ఆధారపడి జరుగుతున్నప్పుడు ఇన్నీ శతాబ్దాల తర్వాత మనం ఆయనను ఏ స్థాయిలో నిలుపుకోవాలి? అందుకే ప్రజలు ఆయనను 'భగవాన్' అన్నారు. భగవాన్ అంటే పరిపూర్ణుడు అని అర్థం.

బుద్ధుడు ఒక సామాజిక కార్యకర్తగా, సంఘసంస్కర్తగా, తాత్త్వికుడిగా ముఖ్యంగా మార్గదర్శిగా చూడకుండా ఆయనను దేవుళ్ళలో కలపడం.



ఆయనకు మతాన్ని పులమడం ఆలోచనలేని కొందరు చేసిన పిచ్చిపని. పరిపూర్ణుడు గనుకనే శతాబ్దాలకు ముందే ఆనాటి ప్రజలు ఆయనను భగవాన్‌గా పూజించారు. శతాబ్దాల తర్వాత ఈనాడు కూడా ఆధునిక ఆలోచనాపరులు ఆయన మేధోశక్తికి అబ్బురపడి ఆరాధిస్తున్నారు. ఆ స్ఫూర్తిని నిలుపుకుని, వచ్చే తరాలకు అందించాలనుకుంటున్నారు. పూజ- అంటే అదే. పూలు, కుంకుమజల్లి, గంటలు మోగించి, అర్థంలేని, అర్థంకాని సంస్కృతశ్లోకాలు అరవడం పూజకాదు. అది దారితప్పిన మనువాదుల పైత్యం.

పదిహేడవ శతాబ్దంలో బుద్ధుడి కార్యకారణ సిద్ధాంతం అందుబాటులోకి వచ్చిన తర్వాతనే యూరోప్‌లో వైజ్ఞానిక విప్లవం వచ్చింది. అంతకు ముందు అక్కడ ఏదైనా జరిగిందంటే దానికి కారణం ధార్మిక, ఆధ్యాత్మిక, దైవకారణాల్ని వెతుక్కునే వారు. ఇది అప్పటి వారి రచనల్లో దొరికిన అంశమే. బుద్ధుడు తన బోధనల్ని నాటి ప్రజల భాష అయిన పాలిభాషలో బోధించాడు. అందువల్ల అతడి బోధనలతో పాటు ఆ పాలి భాష ప్రభావం ఇతర దేశాల మీద కూడా పడింది. ఉదాహరణకు కొన్ని ముఖ్యమైన పదాలు చూద్దాం. ధ్యానాన్ని పాలి భాషలో 'ఝూన్' అంటారు. దాన్ని మన భారతదేశంలో వైదిక మతస్థులు ధ్యానంగా మార్చారు. ఇదే పదం చైనాకు పోయి 'చాన్' అయ్యింది. అక్కడ 'చాన్' సంప్రదాయం ఏర్పడింది. అలాగే పాలిభాషలోని ఝూన్‌పదం జపాన్‌లో జేన్ అయ్యింది. అది పాటించే 'జేన్' సంప్రదాయం అక్కడ వర్ధిల్లింది. ఇదే ఝూన్ కొరియాలో 'సార్‌జాన్' అయ్యింది. వియత్నాంలో 'థియాన్' అయ్యింది. ఇలా వేరువేరు దేశాల్లో ఆ పదం వేరువేరుగా వ్యాపించింది. ఇంతెందుకూ? మనం మన ఊళ్ల పేర్లలో సామాన్యంగా 'పల్లి' అని ఉండడం చూస్తుంటాం. అది పాలి భాషలోంచి వచ్చిందే. ఇరాండ్‌పల్లి- అనే ఊరు అశోకుడి శాసనాలలో కూడా కనిపించింది. పల్లి అంటే పాలిభాషలో నగరం అని అర్థం. పర్షియా రాజధాని పర్సిపోలిస్‌లో పోలిస్ అంటే నగరం అనే అర్థం ఉంది. ఇవన్నీ బుద్ధుడి బోధనలతోపాటు వేర్వేరు భాషల్లోకి ప్రవేశించిన పదాలు. అందుకే మూలాల్లోకి వెళ్లాలి. డాక్టర్ రామ్ విలాస్‌శర్మ వృత్తిరీత్యా ఇంగ్లీషు ప్రొఫెసర్. భాషాశాస్త్రజ్ఞుడు కూడా. బౌద్ధమతాభిమాని అయినందువల్ల ఆ విషయాలలో విస్తృతంగా పరిశోధనలు చేశారు. పాలిభాషా పదాలు వివిధ దేశాలకు ఎలా ప్రయాణించాయన్న విషయం ఆయన చాలా వివరంగా రాశారు. థెరపీ/ థీయరి వంటి పదాల గురించి కూడా ఆయన వివరణ ఇచ్చారు. తార్కిక విశ్లేషణలతో లభించేది 'థేర' అని పాలి భాషలో బౌద్ధం చెపుతుంది. ఆస్థా (నమ్మకం-విశ్వసం) నుండి వేదాలు వచ్చినట్లుగా తార్కిక దృక్పథంతో 'థేర' వచ్చింది. థేర అంటే పెద్దవారు. అన్నీ తెలిసిన విజ్ఞుడు అని అర్థం (థేరవాద: బౌద్ధంలో ముఖ్యమైనశాఖ) వైజ్ఞానిక రంగంలో ఏ సాంకేతిక పదం కనిపించినా దాని మూలం ఇటాలియన్, లాటిన్, గ్రీకు అని చెపుతుంటారు కదా? చాలాకాలానికి ముందు ఈ 'థేర' అనుయాయులే ఈజిప్టులో 'థేరాపుటి' అని పిలవబడేవారు. వీరు చికిత్సకులు. వీరి వల్లనే థెరపి/థియరీ వంటి పదాలు విశ్వవాప్తమయ్యాయి.

ఏదో ఒక మత విశ్వాసంలో బలంగా పాతుకుపోయిన వారికి బహుశా ఈ విషయాలు నచ్చకపోవచ్చు. అబాద్దాల్లో సుఖాల్ని వెతుక్కునే వారికి నిజాలు ఇబ్బందిగానే ఉంటాయి. ❑

## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080.

sunmagvaartha@gmail.com

కథ

# నేటి మహిషాసురుడు

ఉగ్రసేన్ కాళీభక్తుడు. కలకత్తా నుండి తెలుగు రాష్ట్రంలో నున్న ఓ పట్టణానికి వచ్చి వ్యాపారస్థుడిగా మంచి పేరు తెచ్చుకొన్నాడు. ఉగ్రసేన్ ప్రతి సంవత్సరమూ నవరాత్రుల సందర్భంగా సొంతవూరికెళ్లి కాళికాదేవి బొమ్మను తీసుకుని వచ్చి పూజలు జరిపించేవాడు.



ఉగ్రసేన్ అనారోగ్యం వలన పదవతరగతి చదివే కొడుకు బిక్రమ్ ఈ సంవత్సరం దసరాకు కాళికాదేవి బొమ్మ తీసుకొనిరావడానికి కలకత్తా వెళ్లాడు.

బిక్రమ్ అంగడి వాడితో ఎన్నిక చేసిన బొమ్మను చూపించి ఖరీదును చెల్లించాడు. 'మీరు టిఫిన్ చేసి రండి నేను చక్కగా ప్యాక్ చేసి మీ బండిలో ఉంచుతాను' అన్నాడు అంగడివాడు.

డ్రైవర్‌తో కలసి బిక్రమ్ టిఫిన్ చేసుకొని వచ్చాడు. వర్షం వచ్చినా తడవకుండా ఉండేలా టార్పాలిన్ కప్పివుంచాడు. డ్రైవర్ పక్కనే కూర్చొని బయలుదేరి వచ్చాడు.

కాళికాదేవి బొమ్మను దించడానికి మనుషుల సహాయంతో టార్పాలిన్ తీసి ఉలిక్కిపడ్డాడు. 'కాళికాదేవి విగ్రహం పాదాల ముందుంచవలసిన రాక్షసుడు విగ్రహం ఎక్కించడం అంగడివారు మరిచిపోయినట్లుంది. ఇక కొన్ని గంటల్లో అంటే రేపు ఉదయం పూజ ప్రారంభించాలి' అనుకొంటూ బిక్రమ్ కనులు మూసుకొని ఆలోచించగా కొత్త ఆలోచన కలిగింది.

ఉదయాన్నే పూజకై వచ్చిన వారు కాళికాదేవిని చూసి సంతోషంతో ఆశ్చర్యపోయారు. అందరూ మెచ్చుకొంటూ ఉగ్రసేన్‌కు చెప్పారు.

'బిక్రమ్ ఇలాంటి ఆలోచన ఎలా వచ్చింది' పక్కనే వున్న కొడుకును అడిగాడు.

'నాన్నా, రాక్షసుడి బొమ్మను ఎక్కించడం మరచిపోయిన సంగతి ఇక్కడకు వచ్చాక తెలిసింది. చిత్రకారుడు నారాయణ నేను చెప్పిన విధంగా పెద్ద ప్లైవుడ్ పలకమీద సెల్‌ఫోన్ బొమ్మగీసి, వీడియో గేమ్స్ అని రాయించాను. ఆ చిత్రాన్ని కాళికాదేవి కాలు కింద ఉండేలా అమర్చి నేటి మహిషాసురుడు అని రాయించాను. కాళికాదేవి చేతుల్లో ఆయుధాలతోపాటు పిల్లలు ఆడుకొనే బంతి, టెన్నిస్‌బాట్, క్రికెట్‌బాట్, హాకీస్టిక్ లాంటివి వుంచాను' అన్నాడు బిక్రిమ్.

'వీడియోగేమ్స్ నేటి బాలల ఆరోగ్యాన్ని చదువును బలహీనపరుస్తోంది. నేటి మహిషాసురుడు అంటూ వాడి స్థానంలో సెల్‌ఫోన్ వీడియో గేమ్ బొమ్మ పెట్టాలన్న ఆలోచన చాలా బాగుంది' అంటూ కొడుకును మెచ్చుకున్నాడు ఉగ్రసేన్.

– ఓట్ర ప్రకాష్‌రావు

## రంగులు వేయండి





వార్త ఆదివారం

## బాలగేయం

### బాల సాహిత్యం



పరిమళించు మాలిక
సాహిత్య రంగంలో
రమణీయ గీతిక
బాలల సత్ప్రవర్తనకు
పరమౌషధ మూలిక
పిల్లల ప్రగతికి
ప్రజ్వలించు దీపిక
బాలల ఉజ్వల భవితకు
రాజముద్రిక విలువల
వలువలకు భూమిక
మహోన్నత వ్యక్తిత్వానికి
ఏలిక మంచివైపు
జీవితాన్ని శాసించే
వేదిక జీవితాన
వెలుగులు నింపు
తారక సాహిత్య
ప్రస్థానానికి నాయక
అందరూ చదవాలి
చేసుకుని ఓపిక
జీవితానికి
బాల సాహిత్యమే
నీతిచంద్రిక

– డి.కె.చదువులబాబు

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- సి.ఆశిశ్,** నాందేడ్

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. జెయింట్ వీల్ రూపకల్పన ఎలా జరిగింది?

**జవాబు: ఆశిశ్!** మొదటిసారిగా 1893లో చికాగోలో జెయింట్ వీల్‌ను నిర్మించారు. దీనిని జార్జి ఫెర్రిస్ అనే వ్యక్తి నిర్మించడంతో దానిని 'ఫెర్రిస్ వీల్' అని పిలిచేవారు. అప్పట్లోనే ఇది 250 అడుగుల వ్యాసంతో ఉండేది. దానికి ఉండే 36 గదుల ద్వారా 2,160 మంది ఒకేసారి తిరగగలిగేవారు. దీని తర్వాత చెప్పుకోవాలంటే జపాన్‌లోని యొకహామా నగరంలోని చక్రం గురించి చెప్పాలి. 344 అడుగుల ఎత్తున వుండే దీనిలో ఒక పెద్ద గడియారాన్ని కూడా ఇమిడ్చారు. దానిలో 480 మంది కూర్చుని తిరగవచ్చు.

**- ఎన్.అపరాజిత,** హైదరాబాద్

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. 'ఎయిర్ కండిషనర్' ఆరోగ్యానికి చేటు కలిగిస్తుందా?

**జవాబు: అపరాజిత!** వేసవిలో అమ్మకాల జోరందుకునే 'ఎయిర్ కండిషనర్ల' ద్వారా కొన్ని ప్రమాదకరమైన రసాయనాలు- వొలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్ కూడా గదుల్లో సరఫరా అవుతాయని, అందుకని ఏసీ రూముల్లోకి మిగతా సమయాల్లో గాలి ధారాళంగా ఆడేలా చూసుకోవాలని పరిశోధకులు సూచిస్తున్నారు. ఏసీలుపుట్టింది మనకు చల్లదనాన్ని ఇవ్వడానికి కాదు, 1902 జులై 17న మొట్టమొదటి ఏసీ మిషన్‌ను ప్రారంభించింది 'బ్రూక్లీన్ ప్రింటింగ్ ప్రెస్'లో ముద్రిస్తున్న కాగితం. వేడి కారణంగా వ్యాకోచం చెందకుండా వుండేందుకు. 1920లలో అమెరికా సినిమా హాళ్లలో ఏసీలు అమర్చారు. దీనితో వేసవిలో టిక్కెట్ల కోసం జనం ఎగబడ్డారు. వాస్తవానికి మన ఇళ్లల్లో వాడేది, సినిమా థియేటర్లలో వాడేది ఎయిర్ కండిషనర్ కాదు. ఎయిర్ కూలర్ మాత్రమే. ఇది శరీరానికి తాత్కాలిక ఉపశమనం ఇస్తుందేగానీ ఆరోగ్యానికి మంచిది కాదు.



# మన ఆహారం శ్రేష్ఠమైనదేనా?

డా॥చిట్యాల రవీందర్

భారతీయ ఆహారం ప్రపంచంలోనే అతి పురాతనమైన, సాంస్కృతికంగా సమృద్ధిగా ఉన్న వంటకాలలో ఒకటి. భారతీయ వంటకాల వైవిధ్యం, ఆరోగ్యకరమైన పదార్థాల వినియోగం, సాంప్రదాయ పద్ధతులు భారతీయులను మాత్రమేకాక, ఇతర దేశాల ప్రజలను కూడా ఆకర్షిస్తాయి. సగటు భారతీయ ఆహారం ప్రపంచంలోని పలు ఇతర దేశాల ఆహార పద్ధతులతో పోల్చితే ఎంతో ప్రత్యేకమైనది. భారతీయ ఆహారాన్ని ఇతర దేశాల ఆహారాలతో వివిధ పార్శ్వాలలో పరిశీలించి, వాటి మధ్య ఉన్న ప్రత్యేకతలు, సాంకేతికతలు, ఆరోగ్య ప్రయోజనాలను చూస్తే, భారతదేశంలో ప్రతి ప్రాంతానికీ ప్రత్యేక వంటకాలున్నాయి. ఇది భారతదేశ



సాంస్కృతిక, భౌగోళిక వైవిధ్యానికి అద్దం పడుతుంది. ఉదాహరణకు, దక్షిణ భారతదేశంలో ఎక్కువగా వాడే పదార్థాలు ఇడ్లీ, దోసె, సాంబారు వంటి ఆహారాలు సంతృప్తి కార్బొహైడ్రేట్లు, ప్రోటీన్‌లతో నిండి ఉంటాయి. ఉత్తర భారతదేశంలో ఎక్కువగా రోటీలు, పరోటాలు, నాన్ వంటి ఆహారాలు అధికంగా ఉపయోగిస్తారు. ఇవి శరీరానికి అవసరమైన పోషకాలన్నింటినీ అందిస్తాయి. పశ్చిమ భారతదేశంలో చక్కెర, జీలకర్రతో పూర్ణంగా ఉన్న ఆహారాలపై దృష్టి పెట్టి ఉండగా, తూర్పు భారతదేశంలో బియ్యం చేపలతో కూడిన వంటకాలు ప్రధానమైనవి. ఇతర దేశాల్లో, ముఖ్యంగా పాశ్చాత్య దేశాలలో, ఆహారంలో ఎక్కువగా ప్రోటీన్లు కొవ్వు పదార్థాలతో నిండి ఉంటుంది. అమెరికా, యూరప్ వంటి దేశాలలో ఫాస్ట్‌ఫుడ్ కల్చర్, ప్రాసెస్ట్ ఫుడ్, రెడీ అటు ఈట్ ఫుడ్ ఎక్కువగా ఉపయోగపడుతున్నాయి. ఇది ఆహారంలో వెరైటీ తగ్గించి, ఆరోగ్యకరమైన పదార్థాల వాడకాన్ని తగ్గిస్తుంది. అనేక ఇతర దేశాలలో, ముఖ్యంగా పాశ్చాత్యదేశాల్లో, ప్రోటీన్లు ఎక్కువగా ఉండే మాంసాహారం, పాలు ప్రధానంగా ఉంటాయి. అయితే కూరగాయల వాడకం తక్కువగా ఉంటుంది. భారతీయ ఆహారం ఆరోగ్యపరంగా ఎంతో ప్రయోజనకరం.

భారతీయ వంటల్లో ఎక్కువగా సహజ, సాంప్రదాయపరంగా ఉత్పత్తి చేసిన పదార్థాలు, మసాలాలు, కూరగాయలను వాడతారు. మసాలాలలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు శరీర ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. భారతీయ ఆహారం సమతుల్యమైన, నాణ్యమైన పోషక విలువలను అందిస్తుంది. ఇది దీర్ఘకాలిక ఆరోగ్యానికి తోడ్పడుతుంది. పాశ్చాత్య దేశాలలో ఎక్కువగా ఫాస్ట్‌ఫుడ్, ప్రాసెస్డ్‌ఫుడ్, అధిక కొవ్వు, చక్కెర కలిగిన ఆహారాలు తీసుకుంటారు. ఈ ఆహారాలు తక్కువ పోషకాల విలువలు కలిగి ఉంటాయి. దీని ఫలితంగా అధికబరువు, మధుమేహం, హృద్రోగాలు వంటి ఆరోగ్య సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. ముఖ్యంగా పాశ్చాత్య ఆహారం ఫాస్ట్‌ఫుడ్ సాధారణంగా అధిక క్యాలరీలు, తక్కువ పోషక విలువలతో నిండి ఉంటుంది. ఇది శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు అందించదు. భారతీయ వంటకాల్లో ఎక్కువగా తాజా కూరగాయలు, పప్పులు, ఇతర పదార్థాలు వాడడం ఒక ప్రధాన విశేషం. ఈ తాజా పదార్థాలు ఆహారంలో విటమిన్లు, ఖనిజాలు, ఇతర పోషక విలువలను కాపాడుతాయి. భారతీయ వంటలలో వాడే కూరగాయలు, కాయలు, పప్పులు సంతృప్తికరమైన పోషకాలను అందిస్తాయి. తాజా పదార్థాలను వాడడం వల్ల ఆరోగ్యకరమైన ఆహారం తయారవుతుంది. ఇది శరీరానికి తగినంత పోషకాలు అందిస్తుంది. పాశ్చాత్యదేశాలలో, ప్రాసెస్డ్, ఫ్రోజెన్ ఫుడ్స్ ఎక్కువగా వాడతారు. ఈ ఫుడ్స్ ఎక్కువకాలం నిల్వ చేయబడతాయి. కానీ వాటి పోషక విలువలు తగ్గిపోతాయి. దీనివల్ల శరీరానికి తగినంత విటమిన్లు, ఖనిజాలు అందకపోవచ్చు.



అలాగే, ప్రాసెస్ట్ ఫుడ్స్‌లో అధిక సోడియం, చక్కెర, కొవ్వు ఉంటాయి. ఇది ఆరోగ్యానికి హానికరంగా ఉంటుంది.

భారతీయ ఆహారం ఒక సాంస్కృతిక సంపదగా పరిగణించబడుతుంది. ప్రతి వంటకం వెనుక ఎంతో కొంత చరిత్ర ఉంటుంది. భారతదేశంలో వివిధ పండుగల సమయంలో ప్రత్యేక వంటకాలను తయారు చేయడం, ఆ ఆహారాన్ని దేవతలకు సమర్పించడం ఒక సాంప్రదాయపరమైన పద్ధతి. దీపావళి, సంక్రాంతి, ఉగాది వంటి పండుగల సమయంలో ప్రత్యేక వంటకాలను తయారు చేయడం, ఆ ఆహారాన్ని దేవతలకు సమర్పించడం ఒక సాంప్రదాయపరమైన పద్ధతి. ఫాస్ట్‌ఫుడ్, రెడీ టు ఈ ట్ ఫుడ్ ప్రాముఖ్యత వల్ల ఆహారం త్వరగా సులభంగా తయారుచేయబడుతుంది. అక్కడ సాంప్రదాయాలనేవి మన దేశంతో పోల్చితే తక్కువగా ఉండటం వల్ల, ఆహారంలో సాంస్కృతిక విలువలు తగ్గిపోయాయి. భారతీయ ఆహారం పురాతన ఆయుర్వేద, యోగ, ఆరోగ్య సూచనలను పాటిస్తుంది. ఆయుర్వేద ప్రకారం, కొన్ని ఆహారాలు మన శరీరానికి ఆరోగ్యకరమైన శక్తిని అందిస్తాయి. పెరుగు జీర్ణక్రియకు మేలు చేస్తుంది. బెల్లం రక్తం శుద్ధి చేయడానికి ఉపయోగపడుతుంది.



ఆయుర్వేదంలో చలికాలంలో ఎక్కువగా మసాలాలు వాడటం ఆరోగ్యానికి మంచిదని చెప్పబడింది. అందుకే భారతీయ ఆహారంలో మసాలాలు, ఆయుర్వేద ఔషధాలు అధికంగా వాడతారు. ఆధునికతతో పాశ్చాత్యదేశాల్లో ఆరోగ్యపరమైన నియమాలను పాటించడం తగ్గింది. ఫాస్ట్‌ఫుడ్, ప్రాసెస్ట్‌ఫుడ్‌పై ఆధారపడటం వల్ల పురాతన ఆరోగ్య నియమాలను పాటించడం తగ్గిపోయింది. ఆధునిక ఆహారం ఎక్కువగా రుచిని ప్రాముఖ్యం పెంచుతోంది. కానీ ఆరోగ్యానికి తగినంత పోషకాలను అందించడంలో విఫలమవుతోంది. సగటు భారతీయ ఆహారం అనేది ఒక సంప్రదాయకపరమైన, సాంస్కృతికంగా సమృద్ధిగా ఉండే ఆహారవిధానం. ఇది సకల పోషకాలు, ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇతర దేశాలతో పోలిస్తే, భారతీయ ఆహారం తక్కువ క్యాలరీలు, అదిక పోషక విలువలను అందిస్తుంది. ఇది సాంప్రదాయాలకు అద్దం పడుతుంది. ఆరోగ్యకరమైన జీవితానికి మద్దతు ఇస్తుంది. భారతీయ ఆహారం కాలక్రమేణా ప్రపంచవ్యాప్తంగా తన ప్రత్యేకతను, సాంస్కృతి విలువలను నిలబెట్టుకోగలిగింది. భారతీయ వంటల్లో ప్రత్యేకమైన ఆహార పదార్థాలు సాంప్రదాయ సూత్రాలు ఎక్కువగా కనిపిస్తాయి. పాలు, పెరుగు, మిరియాలు, ఇంగువ వంటి పదార్థాలు అనేక వంటకాల్లో వినియోగిస్తారు. ఇవి కేవలం ఆహారంలో రుచిని పెంచడమే కాకుండా, ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తాయి. పాలు,






పెరుగు వంటి పదార్థాలు ప్రోటీన్, కాల్షియం వంటి ముఖ్య పోషకాలను అందిస్తాయి. అలాగే, ఇంగువ మిరియాలు జీర్ణక్రియను మెరుగుపరచి, శరీరంలోని వాయు సమస్యలను తగ్గిస్తాయి. పాశ్చాత్యదేశాల్లో ఎక్కువగా రెడీ టు ఈట్ ఫుడ్స్, ప్రాసెస్డ్ పదార్థాలు వాడతారు. ఈ పదార్థాలు ఎక్కువగా రసాయనిక పదార్థాలతో నిండి ఉంటాయి. వీటివల్ల ఆహారంలో పోషక విలువలు తగ్గిపోతాయి. ఇంకా, పాశ్చాత్య ఆహారంలో ప్రోటీన్, కొవ్వు పదార్థాల మోతాదులు అధికంగా ఉంటాయి. కానీ విటమిన్లు, ఖనిజాలు తక్కువగా ఉంటాయి. ప్రత్యేక ఆహార పదార్థాల వినియోగం తక్కువగా ఉండటం వల్ల, వారి ఆహారంలో ఆరోగ్యకరమైన గుణాలు తగ్గిపోతాయి. భారతీయ వంటకాల్లో రుచులు, ఘుమఘుమలు, సుగంధ ద్రవ్యాల సమన్వయం అనేది ఒక ప్రత్యేకమైన గుణం. ప్రతి వంటకంలో రుచులను సమన్వయం చేయడం, రుచులను పరిపూర్ణంగా తీర్చిదిద్దడం భారతీయ వంటకాల్లో ఒక ప్రత్యేక కళ. బిర్యానీ, రసాలు, చట్నీలు, పప్పులు వంటి వంటకాల్లో రుచులు పరిపూర్ణంగా ఉంటాయి. ఈ వంటకాలు ప్రతి వ్యక్తికీ తగినంత రుచిని, ఆరోగ్యాన్ని అందిస్తాయి. పాశ్చాత్య ఆహారంలో రుచుల సమన్వయం తక్కువగా ఉంటుంది. ముఖ్యంగా ఫాస్ట్‌ఫుడ్ లేదా ప్రాసెస్డ్ ఫుడ్‌లో రుచులు కొద్దిగా ఉండటంతో, ఆరోగ్యకరమైన ఆహారంలో రుచులు పరిపూర్ణంగా ఉండవు. ఇది ఆహారానికి తగినంత రుచులను అందించడంలో విఫలమవుతుంది.

భారతీయ ఆహారం అనేది ఒక సంప్రదాయ, సాంస్కృతి ఆరోగ్యకరమైన ఆహార విధానం. ఇది శరీరానికి తగినంత పోషక విలువలను, రుచులను, అనుభవాలను అందిస్తుంది. ఇతర దేశాలతో పోలిస్తే, భారతీయ ఆహారం ఎంతో ప్రత్యేకమైనది, ఆరోగ్యానికి చాలా మంచిది. ఈ విధంగా భారతీయ ఆహారానికి తగినంత ప్రాముఖ్యతనూ, విలువనూ ఇవ్వాలని మనం గుర్తించుకోవాలి. ❑

కథ

**ఉలి**

# జీవితమే ఒక ఆట



**నేను పుట్టకముందు నుంచే నన్ను చంపాలని ప్రయత్నించారు.**

**తల్లిగర్భంలో వున్న నేను 'ఆడపిల్ల'గా పెరుగుతున్నానని తెలిసి, పుట్టకముందే అబార్షన్ చేసి, నన్ను చంపేయాలని చూసారు.**

**కానీ అమ్మ చూపిన చల్లని ప్రేమ నాకు రక్షణ కవచమై ఈ లోకంలోకి అడుగు పెట్టాను.**

**"ప్చ్.. ఆడపిల్ల.." అని నాన్న పెదవి విరుపు- మొదటి కామెంట్.**

**"ఇంకేముంది? ఉన్నది కాస్తా ఊడ్చుకుపోయేందుకే పుట్టింది" బామ్మ వేసిన అభాండం.**

"వంశోద్ధారకుడు వస్తాడనుకుంటే ఆడపిల్ల అఘోరించిందేమిటీ?" మేనత్తల దీర్ఘపు నిట్టూర్పులు.

"ఓ అయ్య చేతిలో పెట్టేవరకు కంటికి రెప్పలా చూసుకోవాలమ్మా.." అమ్మకి అమ్మమ్మ చెప్పిన హితవు..

మా ఇంట్లో నాన్న మొదలుకొని బామ్మ, మేనత్తలు, దగ్గరి బంధువులు, పుట్టినప్పట్నుంచీ నన్ను ఎవరో ఒకరు కసురుకుంటూనే వుండేవారు. చీటికీ మాటికీ ఏదో నెపంతో నన్ను చీదరించుకుంటూనే వుండేవారు.

ఆ తొమ్మిది నెలలు అమ్మకడుపులో వుండి అమ్మ పడుతున్న ఆవేదనను చవిచూసిన స్ఫురణనో, లేక అనుక్షణం టెన్షన్ పడిన అమ్మ ఊపిరిని షేర్ చేసుకున్న ఫలితమో.. కొంచెం కొంచెం ధైర్యాన్ని కూడగట్టుకొని, మనోస్థైర్యాన్ని ఒంటబట్టించుకొని, ఈ లోకంలో ఎలా బతకాలో నేర్చుకోవడం అలవాటు చేసుకున్నాను.

రోజులు గడుస్తున్నకొద్దీ ఈ లోకంలో ఆడపిల్లగా బతకటం ఎంత కష్టమో

నాకు ధైర్యం చెపుతున్నట్లు "జీవితమే ఒక ఆట.. సాహసమే పూబాట.." అంటూ పాడింది అమ్మ.

ఆ పాటలోని భావాన్ని అర్థం చేసుకోవటం కోసం ప్రయత్నించాను.

రోజులు గడుస్తున్నకొద్దీ కొద్దికొద్దిగా ఒంటబట్టింది అంతరార్థం.

అవన్నీ గుర్తుకొస్తుంటే ఊపిరి పీలుస్తుంటే కలిగే ఆనందం.. ఊపిరి వదులుతుంటే తెలియని ఏదో భయం.. నన్ను అనుక్షణం వెంటాడుతూనే వుంది.

ప్రశాంతంగా నిద్ర పోదామనుకున్నా.. నాలో ఏదో తెలియని అలజడి..!

నిద్ర కోసం మెలి..మె..ల్లి..గా.. నా అనుభవంలోకి వచ్చింది.

యుక్త వయస్సు లోకి వచ్చేసరికి "ఎప్పుడూ ఒంటరిగా తిరగకు.. ఎవరో ఒకరిని వెంటపెట్టుకొని వుండు" అని అమ్మ చెప్పే జాగ్రత్తలు, "అసలే రోజులు బాగా లేవు. చీకటి కాకముందే ఇంటికి రా" అని నాన్న పెట్టిన ఆంక్షలు, "ఆడపిల్లవి.. అణుకువగా వుండు. మగరాయుడిలా తిరగమాకు.." అని బామ్మ చేసే హెచ్చరికలు నన్ను ఉక్కిరిబిక్కిరి చేసేవి.

"ఆడపిల్లగా పుట్టడం నేరమా?" అని ఒకసారి అమ్మని అడిగేను.

బదులుగా చిన్నగా నవ్వింది అమ్మ.

"మరి.. ఎందుకమ్మా నన్ను కన్నావు? ఇలాంటి ఇబ్బందుల మధ్య బతకటం కంటె, పురిటిలోనే చనిపోతే బావుండనిపిస్తుంది" చెప్పేను బాధగా.

కళ్లు మూసుకుంటే శాశ్వతంగా అలాగే కన్ను మూసింది అనిపించుకుంటానేమో.. అని బెంబేలుపడేదాన్ని.

ఆ మాటకొస్తే ప్రఖ్యాత కవి అలిశెట్టి ప్రభాకర్ చెప్పినట్లు

"కన్ను తెరిస్తే జననం..

కన్ను మూస్తే మరణం..

రెప్పపాటే ఈ జీవితం.."

నిజమేనా..? మనిషి జీవితం రెప్పపాటేనా?

మరి.. రెప్పపాటే అయితే, ఇంత కుళ్లూ కుతంత్రాలు ఎందుకు?

ప్రశ్నలే..! అన్నీ ప్రశ్నలే...!!

జవాబు కోసం వెతుకుతూ దారి తప్పిపోయిన ప్రశ్నలు..!

నా జీవిత కాలంలో తిరిగి నన్ను చేరుకుంటాయో లేదో తెలియని అగమ్యగోచరాలు.

స్కూల్లోనూ, కాలేజీలోనూ క్లోజ్‌గా వుండే స్నేహితులు తోడవలేదు.

అందరూ చీదరించుకుంటే ఆపన్న హస్తాల్లా నన్ను అక్కున చేర్చుకొని జీవితం అంటే ఏమిటో నాకు పాఠాలు బోధించాయి పుస్తకాలు.

సాహిత్య పఠనంతోనే నా మాటతీరు, మనుగడ, జీవన విధానం మారిపోయాయయనేది పచ్చి నిజం.

"చిరిగిన చొక్కా అయినా తొడుక్కో, కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో.." అన్న కాళోజీ మాటలే స్ఫూర్తిగా కొనుగోలు చేసిన పుస్తకాలతో మా ఇంట్లో లైబ్రరీ వెలసింది.

ఆ పుస్తకాలే నాకున్న ఆస్తి.

ఆ సాహితీ సుమగంధమే నన్ను వెన్ను తట్టి ముందుకు నడిపించే మార్గదర్శి.

...........

ఈ జనారణ్యంలోని వింత మనస్తత్వాల మనుషుల మధ్య బతకటం కంటే అడవిలోని జంతువులతో సహవాసం చేయడం మంచిదనే భావన-నా మనసులో బలంగా నాటుకుపోయిందేమో!

ఆ దారిలోనే నడిచి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్(ఎఫ్ఆర్‌వో)గా నియమితురాలినయ్యాను. దట్టమైన చెట్లతో కూడిన నల్లమల అడవిలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టాను.

డ్యూటీలో జాయిన్ అయిన కొద్ది రోజులకు తెలిసింది.. ఈ లోకంలో క్రూరమృగాల కంటే భయంకరమైన కుట్రలతో వుండే మనుషులతోనే జాగ్రత్తగా వుండాలనిపించింది.

వయసులో వున్న ఆడపిల్ల ఉద్యోగ బాధ్యతల నిమిత్తం ఒంటరిగా తిరుగుతుంటే వెన్ను తట్టి ప్రోత్సహించాల్సిందిపోయి, కొన్ని మగచూపులు వెన్ను తడుముతాయి అనే చేదు నిజం అనుభవంలోకి వచ్చింది.

ఛాన్స్ కోసం ఎదురు చూసే గోతికాడి గుంట నక్కలు.. కళ్లతోనే అందాల్ని జుర్రుకునే చిత్తకార్తె కుక్కలు.. మనిషి రూపంలో నా చుట్టూ తిరుగుతున్నాయని నేను గమనిస్తూనే వున్నాను.

నా జాగ్రత్తలో నేను ఉన్నప్పటికీ ఆరోజు మధ్యాహ్నం..

వన్యప్రాణులను కొందరు వేటగాళ్లు చంపేస్తున్నారని తెలిసి పట్టుకోవడం కోసం మా టీమ్ అంతా అడవిలో సెర్చింగ్ మొదలెట్టాం.

నలుగురం నాలుగు దిక్కుల్లో వెతకటం కోసం బయలుదేరాం.

ఇంతలో ఏ పొదల మాటున దాక్కొని వుందో ఏమో.. ఒక్కసారిగా నా మీదకు దుమికింది పెద్దపులి.

అసంకల్పితంగా క్షణాల్లో మెరుపు వేగంతో పక్కకు జరుగుతూ ట్రిగ్గర్ నొక్కాను.

ఆ బుల్లెట్ నేరుగా వెళ్లి పెద్దపులి కాలిలో దిగబడింది. అది మళ్లీ దాటి చేస్తుందేమోనని భయంతో మరో రెండు రౌండ్లు గాల్లో పేల్చాను. దాంతో ఆ పెద్దపులి కుంటుకుంటూ అక్కడి నుండి పారిపోయింది.

హమ్మయ్య.. అనుకుంటూ ఊపిరి పీల్చుకొని మరోవైపు నడిచేను.

అలా చాలా దూరం వెళ్లేసరికి వేటగాళ్లు కనిపించలేదు కానీ మనిషి రూపంలో వున్న తోడేళ్లు కనిపించాయి.

వాళ్లు ముగ్గురూ ఇప్పసారా మత్తులో తూగుతున్నారు. నన్ను చూసి అలర్ట్ అయ్యారు. నాతో పాటుగా ఇంకా ఎవరైనా వున్నారా? అని చుట్టూ పరిశీలించి చూసారు. ఎవరూ కనిపించకపోవడంతో వాళ్లలో ఏదో ఆశ కలిగినట్లు వాళ్ల కళ్లలో మెరుపు కనిపించింది.

అది గమనించి "నా జోలికి రావద్ద"ని హెచ్చరించడానికి నా చేతిలో రివాల్వర్

> "చిరిగిన చొక్కా అయినా తొడుక్కో, కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో.." అన్న కాళోజీ మాటలే స్ఫూర్తిగా కొనుగోలు చేసిన పుస్తకాలతో మా ఇంట్లో లైబ్రరీ వెలసింది. ఆ పుస్తకాలే నాకున్న ఆస్తి. ఆ సాహితీ సుమగంధమే నన్ను వెన్ను తట్టి ముందుకు నడిపించే మార్గదర్శి.

వుందనే విషయం తెలియజేయడానికి దాన్ని మెల్లిగా సెట్ చేస్తున్నట్లు.. సరి చేస్తూ అక్కడి నుండి వెనక్కి వచ్చేసాను.

నాలుగడుగులు వేసానో లేదా వెనుక నుంచి ఒకతను దాడి చేసి పెద్ద కర్రతో చేతిపై గట్టి దెబ్బ కొట్టాడు. దాంతో చేతిలోని రివాల్వర్ దూరంగా ఎగిరిపడింది. ఇంతలో మిగతా ఇద్దరూ ఎటాక్ చేశారు.

ఆ క్షణం ధైర్యం కోల్పోయి, నిస్సత్తువగా వుండిపోయేను. నాన్న, బామ్మ, మేనత్తలు మాటలు గుర్తుకొచ్చి నిలువెల్లా కుంగిపోయాను.

కళ్లలోని నీరు ఉబికివచ్చింది. కాళ్లు, చేతులు వణకడం మొదలెట్టాయి.

అయిపోయింది...! నా జీవితం పూర్తిగా నాశనం అయిపోతోంది..

చెరొకవైపు చేతుల్ని దొరకపట్టుకున్నారు. మరొకడు నా ఒంటిపై వున్న చున్నీ లాగేశాడు.

అంతే! ఆ క్షణం ఒంట్లోని బలాన్నంతా కూడగట్టుకొని ఒక్క ఉదుటున మోకాలు మడిచి అతని ముందు భాగంలో గట్టిగా తన్నాను.

దాంతో అతను విలవిలలాడుతూ కిందపడిపోయేడు.

ఈ ఆకస్మిక పరిణామానికి నివ్వెరపోయేరు మిగతా ఇద్దరూ.


## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

*sunmagvaartha@gmail.com*

వాళ్లు తేరుకునేలోగా నా చేతులు విదిలించుకొని, కనిపించిన కర్రను తీసుకొని ముగ్గురినీ చితకబాదేను.

కిందపడిన రివాల్వర్ తీసుకొని గురి పెట్టేలోగా బతుకుజీవుడా! అనుకుంటూ పారిపోయేరు ముగ్గురూ.

ఇక ఈ విషయం బయటకి తెలిస్తే తన పరువు పోతుందని ఏమీ జరగనట్లు ఊరకుండిపోయేను.

...........

నాకు మొదటి నుంచి ఏ విషయమైనా షేర్ చేసుకునే ప్రియమైన నేస్తం, ఆత్మీయ బంధువు.. మా అమ్మనే.

జరిగిందంతా ఒక్క అమ్మకే చెప్పేను. అది విని అమ్మ కంగారు పడింది. "ఈ విషయం ఇంకెవరికీ చెప్పొద్దు" అని ఒట్టు పెట్టించుకుంది.

"సరేనమ్మా.. " అని అమ్మకి మాటిచ్చేను.

అమ్మ నా గురించి ఏం ఆలోచించిందో నా జీవితాన్ని ఎలా తీర్చిదిద్దాలనుకుందో.. లేక, ఓ అయ్య చేతిలో పెడితే తన బాధ్యత తీరిపోతుందనుకుందో ఏమో! వారం రోజుల్లోనే నా పెళ్లి కుదిర్చింది.

మరో వారం రోజుల్లోనే నేను మా అత్తగారింట్లో కొత్త కోడలిగా అడుగు పెట్టేను. నాకు అదో కొత్త 'కంగారు' లోకం.

ఇరుగు పొరుగూ చెప్పినట్లు టీవీ సీరియల్‌లో చూపించినట్లు మా అత్త, మామల్ని, ఆడపడుచుల్ని చూస్తే చాలు.. నాకు వెన్నులోంచి వణుకు పుట్టుకొచ్చేది.

పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టయింది నా పరిస్థితి.

అందరితో అణకువగా, మెలకువగా, అతి జాగ్రత్తగా మెలగటం అలవాటు చేసుకున్నాను.

ఎవరి పరిస్థితి ఎలా వున్నా, సుఖ దుఃఖాలకు అతీతంగా కాలం గడుస్తూనే ఉంది.

ఒకరోజు నలతగా వుండి కళ్లు తిరిగి పడిపోయేను. కంగారు పడుతూ నన్ను హాస్పిటల్‌కు తీసుకెళ్లారు మా వారు.

చెకప్ చేసిన డాక్టర్ నాకు ప్రెగ్నెన్సీ వచ్చిందని చెప్పింది. ఆ క్షణం నేను 'అమ్మ'ను కాబోతున్నందుకు గొప్ప సంతోషం కలిగింది.

కానీ, అంతలోనే ఏదో అలజడి. పుట్టబోయేది ఆడపిల్లనా?!

నా అనుమానం నిజమేనన్నట్లు నాలుగలో నెలలో స్కానింగ్‌లో తేలింది(స్కానింగ్ చేయడం నేరమే అయినా మా వారు పట్టుబట్టి చేయించారు). ఈ విషయం తెలిసి మా ఇంట్లో పెద్ద తుఫాన్ చెలరేగింది.

...........

కడుపులో పాప పుట్టకముందే తనని చంపాలని ప్రయత్నించారు.

తల్లిగర్భంలో వున్న తను 'ఆడపిల్ల'గా పెరుగుతున్నానని తెలిసి, పుట్టకముందే అబార్షన్ చేసి, చంపేయాలని చూశారు.

కానీ, నా అమ్మతనం చూపిన చల్లని ప్రేమ తనకి రక్షణ కవచమై ఈ లోకంలోకి అడుగు పెట్టింది.

నవమాసాలు మోసి పునర్జన్మించి నా పాపకి జన్మనిచ్చాను.

అదో అద్భుతమైన అద్వితీయమైన ఆనందం..!

ఆ మాతృత్వంలో మాధుర్యాన్ని చవిచూసిన నాకు ఎవరి కామెంట్స్ చెవికెక్కలేదు.

"ప్చ్..ఆడపిల్ల.." మా వారి పెదవి విరుపు.. మొదటి కామెంట్.

"ఇంకేముంది? ఉన్నది కాస్తా ఊడ్చుకుపోయేందుకే పుట్టింది" అత్తగారు వేసిన అభాండం.

"వంశోద్ధారకుడు వస్తాడనుకుంటే

**అమ్మ నా గురించి ఏం ఆలోచించిందో.. నా జీవితాన్ని ఎలా తీర్చిదిద్దాలనుకుందో.. లేక, ఓ అయ్య చేతిలో పెడితే తన బాధ్యత తీరిపోతుందనుకుందో ఏమో! వారం రోజుల్లోనే నా పెళ్లి కుదిర్చింది. మరో వారం రోజుల్లోనే నేను మా అత్తగారింట్లో కొత్త కోడలిగా అడుగు పెట్టేను.**

ఆడపిల్ల అఘోరించిందేమిటీ?" ఆడపడుచుల దీర్ఘపు నిట్టూర్పులు.

"ఓ అయ్య చేతిలో పెట్టేవరకు కంటికి రెప్పలా చూసుకోవాలమ్మా" మా అమ్మ చెప్పిన హితవు.

మా ఇంట్లో మా వారు మొదలుకొని అత్తమ్మ, మామయ్య, ఆడపడుచులు, దగ్గరి బంధువులు, పుట్టినప్పట్నుంచీ పాపని ఎవరో ఒకరు కసురుకుంటూనే ఉన్నారు.

చీటికీ మాటికీ ఏదో నెపంతో పాపని చీదరించుకుంటూనే వుంటున్నారు.

పితా రక్షతి కౌమారే
భర్తా రక్షతి యవ్వనే
పుత్రా రక్షతి వార్ధక్యే..

ఈ లోకంలో ఆడపిల్ల ఎవరో ఒకరి సంరక్షణలోనే జీవితం గడపాలట! అయినా ఈ లోకంలో మరో మనిషి జన్మనిచ్చే అద్భుత, అరుదైన గొప్ప వరం ఒక్క ఆడపిల్లకే వుంది. అది సమస్యలన్నింటినీ ఎదుర్కొని నిలబడినప్పుడే అనుభవంలోకి వస్తుంది.

ఇప్పుడు- అమ్మ చెప్పిన పాట గుర్తుకొచ్చింది.

"జీవితం ఒక ఆట
సాహసమే పూబాట.."

✦

## సరదా రచనలకు ఆహ్వానం

***జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి.***

***మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.***

*sunmagvaartha@gmail.com*

సాహిత్యం

జయసూర్య

# అంతర్జాల వలయంలో మేధావికాసం

"కడలి అంచులు దాటి కదిలింది తెలుగు
ఎదల లోతులు మీటి ఎగసింది తెలుగు
ఏ భాష చెణకైన ఏ యాస చినుకైన
తనలోన కలుపుకొని తరలింది తెలుగు"

**అని కవి సినారె అభివర్ణించినట్లు, ఏ ప్రపంచ భాషతో పోల్చినా, భారతీయ భాషలతో చూసుకున్నా శాస్త్ర, సాంకేతిక పదజాలాన్ని ఇట్టే ఇముడ్చుకోగల శక్తియుక్తులున్న ఏకైక భారతీయ భాషగా తెలుగు విశ్వదీప్తి పొందుతోంది. సమాజం నిరంతరం మారుతున్నట్టే, దానికి అనుగుణంగా సాహిత్యం మారుతున్నట్టే భాష కూడా మారటం సహజ లక్షణం.**

ఒకప్పటి గుంట ఓనమాల ఒరవడి ప్రస్తుత 21వ శతాబ్ద తృతీయ దశకంలో అడుగు పెట్టే కాల యవనికపై, తెలుగు అంతర్జాల సాంకేతిక నైపుణ్యంలో విరాజిల్లుతోంది. మిగిలిన ద్రావిడ భాషలతో తులనాత్మక అధ్యయనం చేసి పోల్చుకొంటే, తెలుగు సంగీతంలా వీనుల విందుగా వినిపిస్తుందని పాశ్చాత్యులు ధృవీకరించారు. శ్రవణానందకరమైన మన మాతృభాష సంకుచితత్వంతో కుచించుకుపోయే భాష కానేకాదు. ఫ్రాన్సిస్ వైట్ ఎల్లిస్, రాస్మన్ క్రిస్టియన్ రాస్క్, రాబర్ట్ కాల్డ్వెల్, సర్‌జార్జి గ్రియరెన్స్, విలియం కేరీ, ఎ.డి.కాంప్‌బెల్, హెన్రీమోరిస్, హాల్డెన్, సి.పి.బ్రౌన్, విలియం బ్రౌన్‌లు తదితరులు తెలుగు భాష గురించి వేనోళ్ల ప్రశంసించారు. మరుగున పడిన తెలుగు కావ్యాలను, పద్యాలను వెలుగులోకి తెచ్చారు. నిఘంటువులు, వ్యాకరణ గ్రంథాలను స్వయంగా రాశారు. పరిష్కృత ప్రతులు శ్రమించి అన్వేషించి తయారు చేసి ముద్రింపచేసి అనన్య సామాన్యమైన సేవలందించారు. జి.హోమ్‌ఫీల్ మెక్‌లాయిడ్ వంటి మహనీయులు ఎందరో, శబ్ద సంపదలో, సౌష్టవంలో, భావ వ్యక్తీకరణలో, శ్రావ్యతలో, సొంపైన మధురాతి మధురమైన భాషగా తెలుగును కీర్తించారు. కానీ భాషకు సంబంధించి తెలుగువారికి ఉన్న ఉదాసీనత, నిరాసక్తత అంతా యింతా కాదు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని, కంప్యూటర్ల వినియోగం పెరుగుతున్న డిజిటల్ అధునాతన యుగంలో వున్న యువతరం, గత పుష్కర కాలంలో కొంతవరకు అంతర్జాల వేదికగా ఉద్యమిస్తున్న మౌలిక, విప్లవాత్మక మార్పులు విద్యాధికులకే పరిమితం కాకుండా సర్వవ్యాప్తం కాగలిగే అసాధ్యాన్ని సుసాధ్యం చేయాలి. కంప్యూటర్‌లు వినియోగించాలంటే ఆంగ్లం వచ్చి ఉండాలనే స్థితి నుంచి ఏ భాషలో అయినా కంప్యూటర్లను వినియోగించుకోగలిగే స్థితికి ప్రపంచం చేరుకొంది. మన కంప్యూటర్లు, సెల్‌ఫోన్‌లు, ఇతరత్రా ఎలక్ట్రానిక్ పరికరాలు మనం తెలుగులో మాట్లాడి ఇచ్చే ఆదేశాలను అర్థం చేసుకొని మనకు తిరిగి తెలుగులోనే బదులిచ్చే ప్రక్రియ. ఇంకా పరివ్యాప్తం కావాలి. తెలుగు మాధుర్యాన్ని అవి అందించగలగాలి. ఇప్పటికే తెలుగులో లభిస్తున్న కంప్యూటర్, మొబైల్ ఉపకరణాల్లోని భాష అర్థంకాని రీతిలో, కొంత తప్పుల తడకగా వుండటానికి కారణం మనమే. మనం వాటిలో తప్పులు, దోషాలు సరి అయ్యేటట్టుగా ఆయా కంపెనీలకు, సంస్థలకు నివేదించగలగాలి. తెలుగు అనువాదాన్ని మరింత సమర్థవంతంగా నిర్వర్తించాలి. ఆధునిక ఆసంకేతిక పరిజ్ఞానం ప్రతీ అంశాన్ని అంతర్జాలానికి అనుసంధానం చేసేస్తుంది. కృత్రిమ మేధ, యాంత్రిక అభ్యాసం వంటి ప్రక్రియలు పురోగమిస్తున్న అధునాతన యుగంలో తెలుగుకు స్థానం కల్పించే ప్రాజెక్టులు, పరిశోధనలు యువతరం, విద్యార్థులు మాత్రమే చేయగలుగుతారు. అన్నింటికీ మించి తెలుగు భాషా వివిధ సాహితీ ప్రక్రియలలో దశాబ్దాల తరబడి అత్యంతంగా శ్రమించి ప్రతిభావంతమైన సాహిత్యాన్ని సృష్టించిన మహనీయులైన కవి పండితులు, రచయితలు వయస్సు రీత్యా కనుమరుగై పోతున్నారు. తెలియనితనమో, తేలిక భావమో, మొహమాటమో, ఉదాసీనత, నిర్లిప్తతో, పరభాషా వ్యామోహమో, లేదా మరేదో కారణమో అటువంటి ప్రాతః స్మరణీయులను గురించి యువతరం అంతగా పట్టించుకోవడం లేదు. వారు జీవితంలో సాధించిన అపార జ్ఞానాన్వేషణ, సాధించిన సామర్థ్యం భవిష్యతరానికి వారు మన మధ్య ఉండగానే పదిలంగా అందించే సత్కృషి లోపిస్తోంది. "అంగట్లో అన్నీ ఉన్నా" అన్న చందాన.. యువత తన గుప్పెట్లో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకొని మాతృభాషను మరింత సుసంపన్నం చేసే ఆలోచనలతో, పథకాలతో పెద్దల భాగస్వామ్యంతో పురోగమించాలి. తెలుగునాట దాదాపు అందరి చేతుల్లోకి సాంకేతికత ప్రవేశించింది. మారుమూల గ్రామాలలో సైతం సాంకేతిక మేధస్సు వికసిస్తోంది.



కంప్యూటర్‌లో తెలుగు నిండార వెలుగుతోంది. అయినా గ్రంథాలలో, పుస్తకాలలో అపరిమిత మేధాసంపన్నత, విషయం పరిజ్ఞానం నిక్షిప్తమై వుంది. కానీ పఠనం పట్ల ఆసక్తి త్వరితంగా క్షీణిస్తోంది. ఆ పునాదులను నిర్లక్ష్యం చేయకుండా రాబోయే తరాలకు పుస్తకాలు దూరం కాకుండా కూడా జాగరూకత చేపట్టాలి.

మిగతా 28వ పేజీలో..)

# కథలు పుట్టించడం లేదు..

యామిజాల జగదీశ్

అది ఫ్రాన్స్ రాజధాని నగరం ప్యారిస్. ఆ ఊళ్లో ఓ రచయిత ఉన్నారు. ఆయన ఎప్పుడు చూసినా ఏదో ఒకటి రాస్తుండేవారు. మిత్రులు ఎవరైనా తనను చూడడానికి వచ్చినప్పుడు కూడా రాయడం మానేవారు కాదు. ఒకవైపు రాస్తూనే వారి మాటలు వింటూ ఉండేవారు. చెప్పవలసిన వాటికి జవాబులు ఇచ్చేవారు.

ఓ రోజు ఆయన తన గదిలో కూర్చుని ఏదో రాసుకుంటున్నారు. బయట ఒకరు నిల్చున్నారు. ఆయనకు తోడుగా మరో వ్యక్తి. ఇంతలో రచయిత మిత్రుడొకడు కూడా వచ్చాడు. అతను వచ్చినప్పుడు రచయిత గదిలోంచి నవ్వులు వినిపించాయి. బయట నిల్చున్న వ్యక్తి తన సహాయకుడితో "ఏంటది? గదిలో నవ్వుల చప్పుడు వినిపిస్తోంది.. ఆయనతో ఎవరో మాట్లాడుతున్నట్టున్నారే.. కనుక మినమిప్పుడు వెళ్లిపోదాం. మళ్లీ వచ్చి కలుద్దాం.." అని వెళ్లిపోబోతున్నాడు.

అయితే ఆ వ్యక్తి "అయ్యా, అలాంటిదేమీ లేదు. ఆయన ఒంటరిగానే ఉన్నారు. ఆయన తన కథలో వచ్చిన పాత్రలతోనే అలా నవ్వుతుంటారు. అది ఆయన అలవాటు" అంటూ తన మిత్రుడిని తీసుకుని లోపలికి వెళ్లాడు.

నిజమే, లోపలికి వెళ్లి చూస్తే రచయిత ఒక్కరే ఉన్నారు.


ఆ రచయిత తనకు తానే మాట్లాడుకుంటున్నారు, నవ్వుకుంటున్నారు.

అయితే తన మిత్రుడి వల్ల ఆ రచయిత తీరు ముందే తెలియడం వల్ల ఈ వ్యక్తి అపార్థం చేసుకోలేదు. అది సరే, ఇంతకూ ఆ రచయిత ఎవరనుకున్నారు? ఆయనే అలెగ్జాండర్ డ్యూమాస్.

ఫ్రాన్స్ దేశానికి చెందిన సుప్రసిద్ధ నవలా రచయిత ఆయన.

ఆయన త్రీ మస్కిటీర్స్ (ముగ్గురు వీరులు) తదితర సుప్రసిద్ధ నవలలు రాశారు. ఆయన ఫ్రెంచ్ భాషలో రాసిన నవలలన్నీ ఇంగ్లీషుతో పాటు అనేక భాషలలో తర్జుమా అయ్యాయి. ఆ నవలలన్నీ ఆయన గురించి ఇప్పటికీ తలచుకునేలా చేస్తున్నాయి.

క్రిస్టీన్ రాణి అనే నవల కూడా ఆయన రాసిందే. ఆ నాటకాన్ని వేదికపై ప్రదర్శించడానికి ఓ నాటక బృందం హక్కులు కొన్నది కూడా. రిహార్సల్ వంటివన్నీ పూర్తయ్యాయి. నాటకానికి విశేష ఆదరణ లభిస్తుందని రిహార్సల్స్ చూసినప్పుడే అందరూ అనుకున్నారు.



అయితే సరిగ్గా ఆ సమయంలోనే ఓ విషయం జరిగింది. ఆ కథనే మరో పెద్దాయన నాటకంగా రాశారని తెలిసింది. ఆయన పేదరికంలో మగ్గుతున్నారు. తన రచనలలో ఒక్క నాటకమైనా ప్యారిస్ నగరంలో ప్రదర్శింపబడాలన్నది ఆ పెద్దాయన ఆశ. డ్యూమాస్‌కు ఈ విషయం తెలిసింది. వెంటనే ఆయన ఓ నిర్ణయానికి వచ్చారు. వేదికపై ప్రదర్శించడానికి సిద్ధంగా ఉన్న తన నాటకాన్ని వెనక్కు తీసేసుకున్నారు. నాటక ప్రదర్శనకు అవసరమైన సర్వ హక్కులు ఆ పెద్దాయన రాసిన నాటకానికి విడిపెట్టారు.

ఇక డ్యూమాస్ రాసిన మరో నాటకం మూడో హెన్రీ. ఈ నాటకానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. ఓ రోజు ఓ మిత్రుడు ఆయనతో అవీ ఇవీ మాట్లాడుతూ-

"నువ్వెలా కథలు రాస్తావు?" అని అడిగాడు.

అప్పుడు డ్యూమాస్ "నేను కథలు పుట్టించను, అవన్నీ తానుగానే నాలో పుట్టుకొస్తాయి" అని జవాబిచ్చారు.

"అదెలా సాధ్యమన్నది" ఆ మిత్రుడి మరో ప్రశ్న.

అయితే డ్యూమాస్ "అదంతా తనకు తెలియదని; ఓ పండ్ల చెట్టు వద్దకు వెళ్లి నువ్వెలా పండ్లను ఇస్తావు? అని అడిగి చూడు. నీకు జవాబు వస్తుందేమో!" అని అన్నారు.

డ్యూమాస్ బోలెడంత సంపాదించారు. అయితే ఆయన వాటిని విచ్చలవిడిగా ఖర్చు చేశారు. మిత్రుల రాకపోకల కోసం ఆయన ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంచేవారు. ఆయన ఇంట్లో ఎప్పుడూ విందు-వినోదాలు జరుగుతుండేవి. ఆయన పిలిచి సన్మానం చేయడానికి వచ్చీ పోయే వారి సంఖ్య కూడా ఎక్కువే. కొందరైతే ఆయన దర్శనం కోసం వచ్చి ఓ రెండు మాటలు మాట్లాడి ఆనందంతో వెళ్లిపోయేవారు.

ఓసారి డ్యూమాస్ ఇంట్లో విందు జరుగుతోంది. అక్కడ ఓ వ్యక్తి ఆబగా తింటున్నాడు. ఓ మిత్రుడు ఆయనను చూసి తనకు పరిచయం చేయమని డ్యూమాస్‌ను అడిగాడు. అప్పుడు డ్యూమాస్ "ఆయనెవరో తనకు తెలియదనీ, తనను ఇప్పటికీ ఎవరూ ఆయనకు పరిచయం చేయలేదని" అన్నారు.

కాలక్రమంలో ఆయన ఖర్చులతో పాటు అప్పులు పెరిగాయి. కోర్టు సిబ్బంది ఇంటికి వచ్చి మాట్లాడుతుండేవారు. అయితే డ్యూమాస్‌కు అప్పుల వాళ్లంటే గిట్టేది కాదు.

ఓ రోజు ఓ వ్యక్తి ఆయనను వెతుక్కుంటూ వచ్చారు. ఓ పెద్దాయన చనిపోయారని, ఆయన అంత్యక్రియలకు డబ్బులు కావాలని అడగడానికి వచ్చినట్లు చెప్పాడు వచ్చిన మనిషి.

అయితే డ్యూమాస్ "చనిపోయింది ఎవరు?" అని అడిగారు.

వచ్చినతను మరణించిన వ్యక్తి గురించి చెప్పారు. ఆయనో రుణదాత అన్నారు. విషయం తెలియడంతోనే డ్యూమాస్ వచ్చిన వ్యక్తి అడిగిన దానికన్నా రెండింతలు ఎక్కువ ఇచ్చారు.

"ఇంతెందుకని?" అతను అడగగా-

"ఆ చనిపోయిన వ్యక్తితో పాటు మరొక వ్యక్తికీ అంత్యక్రియలు చేయండి" అని చెప్పారట డ్యూమాస్.



# ఆడి పాడే 'బతుకమ్మ'

డా॥ ఓరుగంటి సరస్వతి

తరతరాల సజీవన సంస్కృతులు, సంప్రదాయాలకు పల్లెలు ఆనవాళ్లు. ప్రతీ పండుగ ఆచారాలు, సంస్కృతిని ప్రస్ఫుటిస్తుంది. తరతరాలుగా పెద్దలిచ్చిన ఆస్తిపాస్తుల్ని దాచిపెట్టుకొని, ముందు తరాల వారికి అందించడమే ఆనవాయితీ అనుకుంటే పొరపాటు. ఎందుకంటే సంపద కంటే గొప్పది సంస్కృతి. సంస్కృతిలోనే జీవన విలువలు దాగున్నాయి. ఆ విలువలు ప్రకృతితో మమేకమై జరుపుకునే ప్రతీ పండుగలోనూ ఉంటుంది. ప్రకృతి అనే శక్తికి భక్తి అనే ఆచారంతో ప్రజలందరినీ రక్షించమనే వేడుకోలు వినిపిస్తుంది.

తెలంగాణ ప్రాంతంలో చెప్పుకోదగ్గ ఆట పాటల పండుగ 'బతుకమ్మ'. ప్రపంచంలో ఎక్కడా లేని, కనీ వినీ ఎరుగని విధంగా ప్రకృతిపూల బతుకమ్మ పండుగను తెలంగాణలోనే జరుపుకోవడం విశేషం. ఈ పండుగ ఆశ్వయుజ మహాలయ అమావాస్య రోజున 'ఎంగిలిపూలు' పేరుతో మొదలై 'దుర్గాష్టమి'నాటి 'సద్దుల బతుకమ్మ'తో ముగుస్తుంది.

పిల్లలు, పెద్దలు, వయస్సుతో సంబంధం లేకుండా ఆత్మీయానుబంధాలతో కలిసి మెలిసి, ఆడిపాడుకునే పండుగ బతుకమ్మ. మహాలయ అమావాస్య మొదలు తొమ్మిది రోజులు భక్తితో గౌరమ్మకు మహిళలు పూజలు చేసే పండుగ. ఆశ్వయుజ మాసంలో ప్రకృతంతా పచ్చదనంతో పుడమిపై నిండు ముత్తైదువలా కొలువై ఉంటుంది. రంగు రంగుల పువ్వులతో భూమి ఇంద్రధనస్సు చీరెను చుట్టుకొన్నట్లు ఉంటుంది.

మహిళలు, ఇంటి ఆడపడుచులు, ఎంత దూర ప్రాంతంలో ఉన్నా తమ పుట్టింటికి ఆనందంతో వచ్చే పండుగ బతుకమ్మ. మెట్టినింట్లో ఎన్ని బాధలున్నా, కొంత విడుపుగా తల్లిగారింటికి వచ్చి బంధువులను, స్నేహితులను, ఊరిని చూసుకొని ముచ్చటించుకునే ఆటపాటల పూల పండుగే కాకుండా తొమ్మిది రోజుల స్త్రీల పండుగ. వానలు వెలిసిన తర్వాత నిండు కుండల్లా నీళ్లతో చెరువులన్నీ కళకళలాడుతూ ఉన్న తరుణంలో, శరదృతువు ప్రవేశించే శుభ ఘడియల్లో తొమ్మిది రోజుల పాటు తెలంగాణాలో పల్లె పల్లెనా, పట్టణాల్లో చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రకృతి పూల పండుగ బతుకమ్మను జరుపుకోవడం విశేషం.

ప్రకృతితో మమేకమై జరుపుకునే ఈ తొమ్మిది రోజుల పండుగకు ఎంతో ప్రాచుర్యం ఉంది. తొమ్మిది రోజుల పాటు జరుపుకునే బతుకమ్మను ఒక్కొక్క రోజు ఒక్కో పేరుతో పూజిస్తారు. మొదటి రోజు ఎంగిలి పువ్వుల బతుకమ్మ; రెండో రోజు అటుకుల బతుకమ్మ; మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మ, నాలుగో రోజు నానుబియ్యం బతుకమ్మ; ఐదో రోజు అట్ల బతుకమ్మ; ఆరో రోజు అలిగిన బతుకమ్మ; ఏడో రోజు వేపకాయల బతుకమ్మ; ఎనిమిదో రోజు వెన్నముద్దల బతుకమ్మ, చివరిదైన తొమ్మిదవ రోజు చేసేది సద్దుల బతుకమ్మ లేదా పెద్ద బతుకమ్మ.

## బతుకమ్మను పేర్చటం

వివిధ రకాల పూలతో పళ్లెంలో వెదురు బుట్టల్లో ఆకుపచ్చని ఆకులు (గుమ్మడి ఆకులు) పరిచి దొంతరలు.. దొంతరలుగా రంగు రంగుల పూల వరుసలను ముందుగా గుమ్మడి పువ్వుల్ని, తంగేడు, బీర, గన్నేరు, బంతి, గునుగు, చామంతి, బంతి, మొదలైన పూలతో బతుకమ్మని పేర్చి, పైన పసుపు గౌరమ్మను ఉంచి పసుపు, కుంకుమలతో పూజిస్తారు.

మొదటి రోజు పేర్చే బతుకమ్మకు ఎంగిలిపూల బతుకమ్మ అని పేరు. ఇది చాలా పెద్దదిగా పేర్చడం విశేషం. ఆ తరువాత పేర్చే బతుకమ్మలు చిన్నగా పేరుస్తారు. దుర్గాష్టమి రోజున చేసే బతుకమ్మను సద్దుల బతుకమ్మ అంటారు. ఈ విధంగా బతుకమ్మల్ని భక్తి శ్రద్ధలతో పేర్చి సాయంత్రం ఆడి, పాడి



స్త్రీలందరు ఒకరికొకరు వాయనాలు ఇచ్చిపుచ్చుకుంటారు. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి మొదలు తొమ్మిది రోజులు ఎంతో సంబురంగా బతుకమ్మల్ని పేర్చి పండుగ జరుపుకోవడం నేటికీ ఆచారంగా అనుసరించడం మన సంస్కృతికి ఆనవాలుగా చెప్పుకోవచ్చు.

పాత రోజుల్లో మహిళలంతా కలిసి గ్రామాల్లో ఒకే దగ్గర బతుకమ్మను పేర్చి గౌరీదేవతకు పూజాది కార్యక్రమాలు నిర్వహించి ఆ బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు పాడేవారు. రాను రాను కొన్ని మార్పులు చోటు చేసుకోవటంతో సాయంత్రం మహిళలు తమ ఇంటివద్దనే బతుకమ్మలను పేర్చి ఆడి, బతుకమ్మలను తీసుకొని తోటి మహిళలతో సమీపంలో ఉన్న చెరువు వద్దకు తీసుకెళ్లి మళ్లీ అక్కడ బతుకమ్మ పాటలతో భక్తి శ్రద్ధలతో ఆడి పాడి బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్నారు.



ప్రత్యేక తెలంగాణను ఏర్పాటు చేసుకున్న తరువాత రాష్ట్ర పండుగగా బతుకమ్మ మరింత వైభవాన్ని ఇనుమడింప చేసుకుంది. వృత్తి, వర్గ, వర్ణ, కుల, ప్రాంత భేదాలు లేకుండా సమతా ప్రతీకగా వెలుగొందుతుండడం విశేషం.

## నైవేద్యాలు

బతుకమ్మ నైవేద్యాలదీ ప్రత్యేకతగానే చెప్పుకోవాలి. బతుకమ్మరోజు తయారు చేసుకొనే సత్తుపిండి, పులిహోర, నువ్వులన్నం, పెరుగన్నం, బెల్లం, అటుకులు వంటి ప్రసాదాలన్నీ ఆరోగ్య ప్రదాయినిలే అని చెప్పుకోవచ్చు.

ఈ తొమ్మిది రోజులలో ఒక్కోరోజు ఒక్కో విధమైన ప్రసాదం చేస్తారు. అవన్నీ ఆరోగ్య ప్రదాయినిలా విశిష్టతను సంతరించుకునేలా ఉండడం గమనించాల్సిన విషయం.

* **మొదటి రోజు** జరుపుకునే ఎంగిలి పూల బతుకమ్మకు నువ్వులు, బెల్లంతో చేసిన ప్రసాదం పెడతారు.

* **రెండవ రోజు** చేసే అటుకుల బతుకమ్మ కోసం బెల్లం, అటుకులతో ప్రసాదం పెడతారు.

* **మూడవ రోజు** ముద్దపప్పు బతుకమ్మకు ముద్దపప్పు, పాలు, బెల్లంతో ప్రసాదం చేస్తారు.

* **నాలుగవ రోజు** నానుబియ్యం బతుకమ్మకు నానుబియ్యం, పాలు, బెల్లం నైవేద్యంగా పెడతారు.

* **అయిదవ రోజు** అట్ల బతుకమ్మ రోజున అట్లు పోసి, నైవేద్యంగా పెడతారు.

* **ఆరవ రోజు** అలిగిన బతుకమ్మ. ఆ రోజున బతుకమ్మను ఆడరు.

* **ఏడవ రోజు** వేపకాయల బతుకమ్మ. ఆ రోజున బియ్యంపిండి వేయించి, చిన్న ఉండలుగా చేస్తారు.

* **ఎనిమిదవ రోజు** వెన్నముద్దల బతుకమ్మ. నువ్వులు, వెన్న లేదా నెయ్యి, బెల్లం కలిపి నైవేద్యం చేస్తారు.

* **తొమ్మిదవ రోజు** సద్దుల బతుకమ్మ. ఆ రోజున మలీద ముద్దలు ప్రత్యేక ప్రసాదంగా సమర్పించడం విశేషం.

ఈ తొమ్మిది రోజులు జరుపుకునే పండుగలో ప్రకృతితో మమేకం కావడం, పోషక విలువలున్న ప్రసాదాలను నైవేద్యంగా చేసుకోవడం.. ఇవన్నీ ఆరోగ్యాన్ని, ఆనందాన్ని రెట్టింపు చేసేవిగా చెప్పవచ్చు. ప్రకృతిని ఆరాధిస్తూ బంగారు భవిష్యత్తుకు ఎలాంటి ఆపద రాకుండా నిండునూరేళ్లు జీవనం పండుగలా సాగాలని గౌరీమాతను పూజించడమే బతుకమ్మ పండుగ. బతుకమ్మను పేర్చాక పసుపుతో గౌరీమాతను తయారు చేస్తారు. బతికించి కోరికలు తీర్చే అమ్మగా గౌరీమాతను మహిళలు పూజిస్తారు. పెళ్లి కాని అమ్మాయిలు మంచి భర్త రావాలని, పెళ్లయిన స్త్రీలు నిండునూరేళ్లు తన భర్త, కుటుంబం ఆయురారోగ్యాలతో బాగుండాలని బతుకమ్మను పూజించడం ఈ పండుగ ప్రత్యేకంగా చెప్పవచ్చు. బతుకమ్మ పండుగకు స్త్రీలు అనేక రకాల పాటలు పాడతారు. ఒక స్త్రీ పాట చెబుతుంటే, మిగతావాళ్లు ఆ పాటకి వంత పాడతారు. ఉయ్యాల, కోలో, వలలో, కోయిలా, తుమ్మెదా, రామచిలకా, ఓ రాచగుమ్మడి, చెలియ, మల్లియలో, చందమామ, గౌరమ్మ మొదలైన వంద పదాలు పాడి ఆ పాటను రక్తి కట్టిస్తారు. చేతులతో చప్పట్లు లేదా కోలాటంతో స్త్రీలు సామూహిక స్వరాలతో వినసొంపుగా ఉండడం ఈ పండుగ పాటల బతుకమ్మ (బతుకమ్మ) సహజత్వం.

బతుకమ్మ ఒక సామూహిక ఉత్సవం. ఎటువంటి తారతమ్యాలు లేకుండా అందరూ కలిసి ఈ పండుగలో పాలుపంచుకోవడం విశేషం. మగవారు సైతం ఈ పండుగకు బతుకమ్మను పేర్చడానికి, నిమజ్జనం చేయడానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తారు. పిల్లలు, పెద్దలు అందరూ తొమ్మిది రోజుల పాటు ఈ పండగను ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. తరాలు మారినా, వేషధారణలు మారినా సంస్కృతిలో భాగమైన ప్రకృతి పూల పండుగను భక్తి శ్రద్ధలతో బతుకమ్మ పండుగగా జరుపుకోవడం విశేషం!

తెలంగాణాలోనే కాకుండా ప్రపంచంలో మన తెలంగాణ (తెలుగు) వారు ఎక్కడ ఉన్నా ఈ పండుగను అంతే భక్తి శ్రద్ధలతో జరుపుకోవడం చూస్తే పండుగ ప్రాశస్త్యం అర్థమవుతుంది. ఇలా తెలంగాణలోని అన్ని ప్రాంతాలు బతుకమ్మ చారిత్రక విశిష్టతను గుర్తించి బతుకమ్మ పండుగను సామూహిక ఉత్సవంలా జరుపుకోవడం, రాష్ట్ర పండుగగా అధికారికంగా గుర్తింపు పొందడం గర్వించదగ్గ విషయం.



# మిత్రుడుంటే సర్వస్వమున్నట్లే!

కస్తూరి మురళీకృష్ణ



అవి శాస్త జేతవనంలో విహరిస్తున్న రోజులు.

ఆ సమయంలో భిక్షువుల అభ్యర్థనను అనుసరించి బుద్ధుడు సరస భోజనం పెట్టటం గురించిన గాథను చెప్పారు.

............

ఆ సమయంలో కొందరు భిక్షువులు మధురమైన ఆహార పదార్థాలను జేత వనానికి తీసుకుని వచ్చారు.

వారికి రుచికరమైన భోజనం కావాలన్న కోరిక ఉంది. వాళ్లు రోగులకు సేవ చేసేవారు. "రుచికరమైన ఆహారాన్ని రసపూర్ణమైన ఆహారాన్ని తీసుకు వస్తామని" చెప్పి ఇతరులు శ్రావస్తికి వెళ్లారు.

మిఠాయిలు అమ్మే అంగళ్లున్న వీధులలో ఎంత భిక్షాటన చేసినా వారికి రసపూర్ణమైన ఆహారం లభించలేదు.

వారు కోరిన ఆహారం లభించకపోవటంతో నిరాశతో వాళ్లు జేత వనానికి తిరిగి వచ్చారు.

భిక్షాటనకు బయలుదేరుతున్న సారిపుత్ర స్థవిరుడు వాళ్లని చూసి ఆశ్చర్యపోయి "అదేమిటి? త్వరగా వెనక్కి తిరిగి వచ్చేస్తున్నారు మీరు?" అనడిగాడు.

వారు జరిగిన సంగతి చెప్పారు.

"నాతో రండి" అని స్థవిరుడు వారిని తన వెంట పెట్టుకుని అదే వీధిలోకి వెళ్లాడు.

అక్కడ వారు భిక్షువుల పాత్రల్లో రసవంతమైన ఆహారాన్ని నింపారు.

రోగులకు సేవ చేసేవారు ఆ ఆహారాన్ని తెచ్చి రోగులకు తినిపించారు.

ధర్మసభలో ఈ విషయమై తీవ్రమైన చర్చ జరిగింది.

ఆ సమయానికి శాస్త అక్కడికి వచ్చాడు. "చర్చా విషయం ఏమిటని?" అడిగాడు.

వారు చెప్పిన విషయం విని సమాధానం ఇచ్చారు శాస్త.

"భిక్షువులారా, సారిపుత్రుడికి ఉత్తమం, రసవంతమైన ఆహారాన్ని ఇప్పుడు కాదు, గతంలో కూడా లభించింది. చక్కటి ప్రియభాషణం చేయగలిగిన పండితులకు మధురమైన ఆహారం లభించింది" అన్నారు.

ఇది భిక్షువులలో కుతూహలం కలిగించింది.

గతంలోని గాథను వినాలన్న కుతూహలం కలిగింది వారికి.

"మాకు ఆ గతం తాలూకు గాథను చెప్పండి" అని వారు శాస్తను వేడుకున్నారు.

వారి అభ్యర్థనను మన్నించి శాస్త పూర్వ గాథ చెప్పటం ప్రారంభించాడు.

............

అది వారణాసిలో బ్రహ్మదత్తుడు రాజ్యం చేస్తున్న కాలం. ఆ కాలంలో బోధిసత్త్వుడు శ్రేష్ఠికులంలో జన్మించాడు.

ఒకరోజు బోయవాడొకడు బండి నిండుగా మాంసం వేసుకుని పట్టణంలో వీధి వీధి తిరుగుతూ అమ్మటానికి వచ్చాడు.

ఆ సమయంలో శ్రేష్ఠి పుత్రులు నలుగురు నవరణలో కూడలి వద్ద కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

అంతలో ఒకడికి బండిని చూడగానే మాంసం కొనాలనిపించింది.

"నేను మాంసం తెచ్చుకుంటాను" అన్నాడు.

"సరే, పోయి తెచ్చుకో" అన్నారు మిగతావారు.

ఆయన ఆ మాంసం అమ్మేవాడి దగ్గరకు వెళ్లాడు.

"ఒరేయ్, నాకు ఓ మాంసఖండం ఇయ్యి" అన్నాడు.

ఆ బోయవాడు అతడిని ఎగాదిగా చూసి "మాంసం ముక్కను ఉచితంగా అడగటానికి వచ్చినవాడు సౌమ్యంగా, మర్యాదగా మాట్లాడాలి. నువ్వేలా మాట్లాడితే నీకు అలాంటి ముక్క లభిస్తుంది" అన్నాడు.

"సరే... ఏదో ఒకటి ఇయ్యి" అన్నాడతడు.

"సౌమ్యంగా మాట్లాడే వాడికి మృదువైన మెత్తని మాంసంముక్క. కఠినంగా మాట్లాడే వాడికి కఠినమైన మాంసంముక్క" అన్నాడు.

కఠినమైన, రసం లేని మాంసం ముక్కను ఇచ్చాడు.

నీరసంగా వస్తున్న అతడిని చూసి రెండవ శ్రేష్ఠి కుమారుడు అడిగాడు "నువ్వేమని అడిగావని?"

"ఒరే అని".

"నాకు మాంసం ముక్క నేనూ అతడిని అడుగుతాను" అనుకున్నాడు.

బోయవాడి దగ్గరకు వెళ్లాడు.

"అన్నా, నాకు కాస్త మాంసం ఇయ్యి" అన్నాడు.

"నీ మాటకు తగ్గ మాంసఖండం ఇస్తాను" అన్నాడు బోయవాడు. జంతువు అంగం నుండి తీసిన మాంసంముక్క ఇచ్చాడు.

"నేనూ అడుగుతాను" అని మూడవ కుమారుడు వెళ్లాడు.

"చాచా.. నాకు మాంసఖండం ఇవ్వగలవా?" అని అడిగాడు.

"నీ మాటకు తగ్గ మాంసంముక్క నీకు లభిస్తుంది" అన్నాడు.

"ఎలాంటి ముక్క?" అడిగాడు.

"నీ మాట హృదయం లోపలి నుంచి వచ్చింది. కాబట్టి నీకు హృదయ భాగం నుండి తీసిన రసవంతమైన మాంసంముక్క ఇస్తాను" అన్నాడు. అలాగే ఇచ్చాడు బోయవాడు.

ఇది చూసి నాలుగవ కుమారుడు కూడా "నేనూ మాంసంముక్క అడుగుతాను" అన్నాడు.

బోయవాడి దగ్గరకు వెళ్లి మర్యాదగా అడిగాడు "స్నేహితుడా, నాకు మాంసంముక్క ఇస్తావా?" అనడిగాడు.

దానికి బోయవాడు సంతోషించాడు. "నాకు ఇక్కడ ఒక్క స్నేహితుడు కూడా లేదు. కానీ నీ మాటల వల్ల నాకు ఇక్కడ ఒక మిత్రుడున్నాడని తెలిసింది. మిత్రుడుంటే జగతిలో సర్వస్వమున్నట్టే. కాబట్టి నీకు నా సర్వస్వం ఇస్తాను" అన్నాడు.



అతడి ఇంటికి మాంసం బండిని తీసుకువచ్చి సర్వం అప్పగించాడు.

నాలుగవ కుమారుడు భార్య, పిల్లలను పిలిచి ఆ బోయవాడిని సత్కరించాడు.

"మీరు జంతువులను హింసించే ఈ వృత్తి మానండి. నీ సర్వస్వం నాకు అర్పించావు. కాబట్టి మనం స్నేహితులం. నువ్వు మా ఇంట్లోనే ఉండు. నీకు వేరే జీవికను చూపిస్తాను" అన్నాడు.

అందుకు బోయవాడు, అతని భార్య, పిల్లలు అంగీకరించారు.

వారందరినీ తనతో ఉంచుకున్నాడు. వారితో ఎలాంటి భేదభావం లేకుండా తనతో సమానంగా చూసుకున్నాడు. వారంతా తన కుటుంబంలో భాగం అన్నట్టు కలసి మెలసి ఉన్నాడు.

కథ ముగించిన శాస్త "మంచి మాట మనసును గెలిపిస్తుంది. కఠినమైన మాట కష్టాలను కొనితెస్తుంది" అన్నాడు.

చివరలో "ఆ కాలంలో వేటగాడు సారిపుత్రుడు. నాలుగవ శ్రేష్ఠి కుమారుడను నేనే" అన్నాడు.

............

అది శాస్త జేతవనంలో విహరిస్తున్న కాలం. ఆ కాలంలో భిక్షువుల అభ్యర్థన మేరకు ఆయన "అన్ని అవసరాలకు దానం ఇవ్వటం గురించి భిక్షువులకు చెప్పారు.

............

శ్రావస్తిలో ఒక గృహస్థు బుద్ధభగవానుడిని నమ్మిన వాడుండేవాడు. అతడు బుద్ధ ప్రముఖ భిక్షు సంఘానికి అవసరమైన అన్ని పదార్థాలను దానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాడు.

అతడు తన ఇంటి ముందు పెద్ద మండపం వేయించాడు. ఆ మండపానికి భిక్షువులందరినీ ఆహ్వానించాడు.

మండపంలో బుద్ధుడి కోసం ఉత్తమాసనం వేశాడు. అతడికి వివిధ రకాలైన రసపూర్ణ ఆహార పదార్థాలను వడ్డించాడు.

భిక్షువులందరికీ అత్యంత మధురమైన భోజనం పెట్టించాడు.

అలా వారం రోజుల పాటు భిక్షువులందరికీ అన్నదానం చేశాడు.

ఏడవ రోజు అయిదు వందల భిక్షువులకు అవసరమైన ఆహార పదార్థాలన్నీ అందించాడు.

అవన్నీ స్వీకరించమని బుద్ధుడిని అభ్యర్థించాడు.

ఆ దానాన్ని స్వీకరించేందుకు బుద్ధుడు ఆమోదాన్ని తెలిపాడు.

వాటిని స్వీకరిస్తూ "నువ్వు చక్కటి దానం చేశావు. నీకు సంతోషం కలుగుతుంది. నువ్వు చేసిన దానం పురాణ పండిత పదం వరకు తగిన దానం ప్రాచీన పండితులైన భిక్షువులు రాగానే వారికి తమ సర్వస్వాన్ని అర్పించటమే కాదు, తమ మాంసాన్ని కూడా కోసి ఇచ్చారు" అన్నాడు.

అక్కడ ఉన్న వారందరికీ ఆ గాథ వినాలన్న కుతూహలం కలిగింది.

వారి కోరిక మన్నించి ఆ గాథ చెప్పటం ప్రారంభించాడు.

(ఇంకా ఉంది)



## బతుకమ్మ పాట

### శ్రీలక్ష్మి నీ మహిమలు

శ్రీలక్ష్మి నీ మహిమలూ గౌరమ్మ
చిత్రమై తోచునమ్మా గౌరమ్మ
శ్రీలక్ష్మి నీ మహిమలూ గౌరమ్మ
చిత్రమై తోచునమ్మా గౌరమ్మా
భారతీదేవివై బ్రహ్మకిల్లాలివై
పార్వతీ దేవివై పరమేశు రాణివై
పరగ శ్రీలక్ష్మివైయ్యా గౌరమ్మ
భార్యవైతివి హరికిని గౌరమ్మ
శ్రీలక్ష్మి నీ మహిమలూ గౌరమ్మ
చిత్రమై తోచునమ్మా గౌరమ్మ
ముక్కోటి దేవతలు సక్కనీ కాంతలు
ఎక్కువగా నిను గొల్చి
పెక్కు నోములు నోచి
ఎక్కువా వారయ్యిరీ గౌరమ్మ
ఈ లోకమున నుండియూ గౌరమ్మ
శ్రీలక్ష్మి నీ మహిమలూ గౌరమ్మ
చిత్రమై తోచునమ్మా గౌరమ్మ

(23వ పేజీ తరువాయి..)

## అంతర్జాల..

ఇప్పటికే గ్రంథాలయాలను ఉపయోగించుకోవడం తగ్గిపోయింది. యువతరానికి, సాంకేతికతకు అనుగుణంగా మన మాతృభాషను తీర్చిదిద్దాలి. భాషా స్వరూపం త్వరితగతిన మారిపోతోంది. తెలుగు రాయడంలో తప్పులు దొర్లుతున్నాయి.

ఏది ఒప్పు? ఏది తప్పు? చెప్పేవాళ్లకూ భాషా జ్ఞానం అంతంతగానే వుంది. అర్థం అయితే చాలు చిన్న చిన్న తప్పులే కదా! అనే భావన నెలకొంటోంది. కృతకమైన భాష కాకుండా స్వచ్ఛమైన తెలుగు ఎలక్ట్రానిక్ ఉపకరణాలలో కూడా వినియోగంలోకి తీసుకురాగల మేధా సంపన్నతను వినియోగించుకొన్నప్పుడే తెలుగు సాంకేతిక భాషగా వెలుగొందుతుంది.

**వాస్తువార్త**
**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**
**డా॥ దంతూరి పండరినాథ్**
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్: 9885446501/9885449458

# తూర్పు ముఖ ద్వారమున్నా..!

**ఎస్.వాగ్దేవి – రావులపాలెం**

**ప్రశ్న: గురువుగారు! తూర్పు ముఖ ద్వారం ఉన్న ఇల్లు ఇది. వాస్తు ప్రకారం చాలా మంది ఈస్ట్ ఫేసింగ్ ఇంట్లోనే ఉంటారు. అయినప్పటికీ కొంతమంది చాలా సమస్యలతో బాధపడుతూ ఉంటారు. దీనికి కారణమేమై ఉంటుంది?**

**జవాబు:** వాస్తు పరంగా ప్రథమ ప్రాధాన్యం గల గృహం తూర్పు ముఖ ద్వార గృహమే. అందులో సందేహం ఏమీ లేదు. అలాగని వాళ్లకి సమస్యలు, కష్టాలేమీ రావని అనుకోవద్దు. వాస్తు ప్రకారం తూర్పు ముఖద్వారం ఎందుకు ప్రథమ ప్రాధాన్యతలో ఉందంటే– మనకి ఉదయంపూట ఎండ ఆరోగ్య రీత్యా చాలా అవసరం. ఒక తూర్పు ముఖ ద్వారం ఉన్న ఇండిపెండెంట్ హౌస్‌లోకి ఉదయంపూట ఎండనేరుగా వచ్చేస్తుంది. ఈ సహజ క్రియ అత్యంత ఆరోగ్యవంతమైనది, శుభదాయకం, లక్ష్మీప్రదం. ఇండిపెండెంట్ హౌస్ కాకుండా, అపార్ట్‌మెంట్స్‌లో ఒక ఫ్లాట్ తీసుకున్నప్పుడు వెస్ట్ ఫేసింగ్ ఫ్లాట్ అంటే పశ్చిమ ముఖద్వారం ఉన్న ఫ్లాట్‌ని తీసుకుంటేనే మనకు తూర్పు వైపు నుండి ఉదయంపూట ఎండ ఇంట్లోకి వస్తుంది. అలా కాకుండా తూర్పు ముఖ ద్వారం ఉన్న ఫ్లాట్‌ని తీసుకున్నట్లయితే దానికి ఎదురుగా పశ్చిమ ముఖ ద్వారం ఉన్న ఫ్లాట్ ఉంటుంది. (అంటే.. కారిడార్ మధ్యలో ఉండి తూర్పు, పశ్చిమ ముఖద్వారాలతో ఇరువైపులా ఫ్లాట్స్ కడుతూ ఉంటారు). అందులో తూర్పు ముఖ ద్వారం ఉన్న ఫ్లాట్ తీసుకుంటే దానికి తూర్పున, పశ్చిమ ముఖ ద్వారం ఉన్న ఫ్లాట్ ఉంటుంది. కాబట్టి ముఖద్వారం తూర్పు అయినప్పటికీ, తూర్పు నుండి ఉదయంపూట ఎండ వచ్చే అవకాశం ఉండదు. వీళ్లకి సాయంత్రంపూట మరోవైపు నుండి తీక్షణమైన ఎండ వస్తుంది. పాత కాలంలో ఈ అపార్ట్‌మెంట్ కల్చర్స్ లేవు. అప్పటి వాస్తుకి తూర్పు ముఖ ద్వారమే సరైనదని అనుకోవచ్చు. నిజానికి వాస్తు విషయంలో తూర్పు ముఖ ద్వారాలకు/తూర్పు దిక్కుకు ఎందుకు ప్రాధాన్యం ఇంత ఇచ్చారో తెలుసుకుందాం..



కొన్ని కొన్ని ముఖ ద్వారాలు కొంత మందికి బాగా పనికి వస్తాయి. దక్షిణ ముఖద్వారం పనికొచ్చేవాళ్లు కొంతమంది ఉంటారు. ఉత్తర ముఖద్వారం పనికొచ్చేవాళ్లు కొంతమంది ఉంటారు. పశ్చిమ ముఖద్వారం పనికొచ్చేవాళ్లు కొంతమంది ఉంటారు. వాళ్లు తూర్పు ముఖ ద్వార గృహంలో ఉంటే, వాళ్లకి ఆ తూర్పు ముఖ ద్వార గృహం పెద్దగా హాని చేయదు. ఆ తూర్పు ముఖ ద్వారం ఇంటివాస్తు మామూలుగా బాగున్నప్పటికీ ఏ ముఖద్వారం యోగం వున్నవాళ్లకైనా ఫలితాలు బాగానే ఉంటాయి. చాలావరకు అనుకూల ఫలితాలు ఉంటాయి. ప్రతికూల ఫలితాలు తక్కువగా ఉంటాయి. కొంతమందికి తూర్పు ముఖద్వారం యోగించే పరిస్థితి ఉంటుంది. అటువంటి వాళ్లకి తూర్పు ముఖద్వార యోగం అద్భుతంగా పని చేస్తుంది. కానీ ఉత్తర ముఖద్వార గృహం పనికొచ్చేవాళ్లు దక్షిణ ముఖద్వారంలో ఉంటే మాత్రం ఫలితాలు విరుద్ధంగా ఉండొచ్చు. దక్షిణ ముఖ ద్వారం బాగా పనికొచ్చేవాళ్లు ఉత్తర ముఖద్వారంలో ఉంటే వాళ్లకి గొప్పగా యోగించదు. కానీ తూర్పు ముఖ ద్వార గృహం కూడా వాళ్లకి బాగానే ఉంటుంది. నాలుగు దిక్కుల్లో కూడా తూర్పు దిక్కుని జ్ఞానానికి ప్రతీకగా పేర్కొంటారు. జ్ఞానానికి, పాండిత్యానికి, మంత్రాంగానికి, వైదిక కర్మలకు, విశేషించి కీర్తి ప్రతిష్ఠలకు సహకరించటం ఈ దిక్కు ప్రత్యేకత. పైన చెప్పిన వాటినే వృత్తిగా పెట్టుకున్న వాళ్లకు ప్రధానంగా జ్ఞానం, వేదం, వైరాగ్యం, వేదాంతం మొదలైనవన్నీ కావాలి. ఒక అర్చన చేయడం కానీ ఇతరులకు జ్ఞానాన్ని బోధించడం కానీ, మంత్రాంగం నెరపటం కానీ, గొప్ప గొప్ప రాజులకి, వ్యాపారస్తులకు, వ్యక్తిగత సలహాలను ఇవ్వటంలో కానీ.. యుద్ధ, వ్యాపార తంత్రాలలో దేశానికి పనికి వచ్చే సలహాలు ఇవ్వటం కానీ.. ఇదంతా కూడా జ్ఞానంతో కూడిన వ్యవహారం. అందుకు సంబంధించిన జ్ఞాన సముపార్జన చేయాలని సంకల్పించుకున్న వాళ్లకి తూర్పు ముఖ ద్వార గృహం అద్భుతంగా పనికొస్తుంది. నిజమే! అలాగని ఆ ఇంట్లో సమస్యలు ఏవీ రావని మాత్రం అనుకోకూడదు. సమస్యలు వస్తాయి. కానీ ఆ సమస్యలను కూడా ఎదుర్కోగలిగే శక్తి సామర్థ్యాలు కూడా వీళ్ల కలిగే వుండే తీరుగా ఆ గృహం వీళ్లకి సహకరిస్తుంది. తూర్పు ముఖం ద్వార గృహాల ప్రత్యేకత అదే! ✦

వాస్తువిద్వాన్ **డా॥ దంతూరి పండరినాథ్** పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: **సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-3**

**వాస్తువార్త**

పూర్తి పేరు.................................................................
పుట్టినతేదీ : ...................... ఊరు : ..................
జన్మ నక్షత్రం: ...............తల్లి పేరు: .......................
చిరునామా: ..........................................................



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



దూర దృష్టితో కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. కానీ ఫలితాలు మాత్రం అంతంత మాత్రంగా ఉంటాయి. మీకు అందవలసిన సలహాలు, సహాయం అందకపోవచ్చు. అయితే మీ నుండి ప్రయోజనాలు అందుకోవడానికి సిద్ధంగా వుండే వ్యక్తులు తారసపడతారు. నూతన వ్యాపారాల పట్ల ఆసక్తి కనబరుస్తారు. వ్యాపార స్థలాల్లో నిర్వహణ ఖర్చులు పెరుగుతాయి.

## వృషభం



కుటుంబ సమేతంగా దైవదర్శనం చేసుకోవాలన్న ఆలోచనలు కలిసి వస్తాయి. మొక్కుబడులను తీర్చుకుంటారు. కార్యక్రమాలలో పురోగతి విషయంలో సహ ఉద్యోగుల సహాయం అందుకుంటారు. డయాగ్నస్టిక్స్ సెంటర్స్, క్లినికల్ నడిపే వారికి అనుకూలం. మధ్యవర్తిత్వానికి ప్రాముఖ్యం ఇస్తారు. కొన్ని కార్యక్రమాలను విజయ పథంలో నడిపిస్తారు.

## మిథునం



శీతల పానీయాలు, విదేశీ ఉత్పత్తుల పట్ల ప్రభావితమైన పిల్లలను మందలించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అనారోగ్యకరమైన అలవాట్లకు దూరంగా ఉంచడానికి ఎంతగానో ప్రయత్నిస్తారు. కుటుంబ పరమైన బాధ్యతలు మరింతగా పెరుగుతాయి. నూతన కార్యక్రమాలు, శుభ కార్యాల పట్ల మక్కువ కనబరుస్తారు. ఆత్మీయుల భద్రత పట్ల జాగ్రత్తలు తీసుకుంటారు.

## కర్కాటకం



జీవితాశయాలు, లక్ష్యాలను సాధించడం కోసం ప్రయత్నిస్తారు. నూతన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. దైవ చింతన, ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆకర్షణ కలిగి ఉంటారు. ప్రచారాలు, సభలు, సమావేశాల పట్ల మక్కువ కనబరుస్తారు. ఆ ఏర్పాట్లలో నిమగ్నమవుతారు. నూతన పరికరాలు, సాంకేతిక పరికరాల పట్ల ఆకర్షణ కలిగి ఉంటారు.

## సింహం



నూతన కోర్సులు చేపట్టి విజయం సాధిస్తారు. పోటీ పరీక్షల్లో స్వల్ప అపశృతులు చోటు చేసుకుంటాయి. జీవితాశయాన్ని సాధించడం కోసం అందరికీ దూరంగా వుండి లక్ష్యసాధనే ధ్యేయంగా భావిస్తారు. కుటుంబంలో మరొకరి ఆదాయం పెరగటం మానసిక ధైర్యానికి కారణం అవుతుంది. అనుకోని శుభ కార్యాల వల్ల ఖర్చులు పెరుగుతాయి.

## కన్య



విందు-వినోద కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. కార్యాలయంలో నూతన సహోద్యోగులతో సఖ్యతగా మెలగుతారు. మీకు లభించని అండదండలు, ప్రోత్సాహం వారికి అందజేస్తారు. కొంతమంది బాగుపడడం మీ మనసుకు ఎంతగానో నచ్చుతుంది. సంతాన సంబంధమైన సమస్యలతో సతమతమవుతారు. ఎదురు చూస్తున్న శుభ వార్తలు వింటారు.

## తుల



మధ్యవర్తులతో కొన్ని కార్యక్రమాలు ప్రారంభిస్తారు. స్పెక్యులేషన్‌కు దూరంగా ఉంటారు. కోర్టు వ్యవహారాలు, తీర్పులు మీకు అనుకూలంగా మారుతాయి. ఎంత బాగున్నప్పటికీ మరింత కష్టపడాలి.. అప్పుడే అన్ని విధాలుగా మనకు బాగుంటుంది, ఏ ముప్పు వాటిల్లదు అన్న భావనతో ముందుకు సాగుతారు. జీవిత భాగస్వామితో విభేదాలు ఏర్పడకుండా ఎప్పటికప్పుడు సంయమనంతో వ్యవహరిస్తారు.

## వృశ్చికం



ఏ ప్రయోజనం లేని వ్యక్తులను సైతం చేరదీస్తారు, వారికి అభయ హస్తం అందిస్తారు. తద్వారా ఇంట్లో గొడవలు ఏర్పడతాయి. కనుక వీళ్లని ఏదో ఒక విధంగా మంచి మార్గంలో ఉంచాలి, చక్కగా విద్యాబుద్ధులు అబ్బేలా వీళ్లని హాస్టల్‌లో చేర్పించాలి అన్న ఆలోచనలు ఏర్పడతాయి. క్రియేటివిటీ రంగంలో ఉన్నవారికి కాలం అనుకూలంగా ఉంది. క్రీడల్లో చెప్పుకోదగిన విజయాలు నమోదు చేసుకుంటారు.

## ధనుస్సు



అనారోగ్యం బారిన పడే అవకాశాలున్నాయి కనుక అప్రమత్తంగా ఉండండి. కళా, సాంస్కృతిక రంగాల్లో ఉన్నవారికి నూతన అవకాశాలు, విదేశాల్లో పని చేసే అవకాశాలు కలిసి వస్తాయి. కార్యాలయంలో నూతన ప్రాజెక్టులను అందుకుంటారు. మీ చేతుల మీదుగా కొంత మందికి సహాయ సహకారాలు అందిస్తారు. ధన రూపంలో మాత్రం ఎలాంటి బాధ్యతలు తీసుకోరు. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు.

## మకరం



పాశ్చాత్య దేశాల ప్రభావం వలన పిల్లల్లో కలుగుతున్న మార్పులు, పెద్దల్లో కలుగుతున్న మార్పులు భయం కలిగించేలా ఉంటాయి. ఎన్ని తెలివితేటలున్నప్పటికీ అవకాశాలు మాత్రం చేజార్చుకుంటారు. నూతన గృహం కొనుగోలు చేయడానికి ఎంతగానో ప్రయత్నిస్తారు. అనుకున్న గృహానికి తగిన ధనం సమకూర్చుకోలేక అవస్థ పడతారు. ఆరోగ్య సలహాలు, సూచనలు తూచా తప్పకుండా పాటించడం అత్యవసరం.

## కుంభం



ఇంట్లోనూ, వ్యాపార ప్రదేశాల్లోనూ స్వల్పమైన చికాకులు, మనస్పర్థలు ఏర్పడవచ్చు. మీ వైపు నుండి ఏమాత్రం తప్పులు దొర్లకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తారు. తల్లి తరపు బంధువులతో సాధ్యమైనంతవరకు మాట పట్టింపులకు పోకుండా వాళ్లకు కావలసిన సహాయ సహకారాలు అందిస్తుంటారు. స్నేహితుల ద్వారా నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు.


## మీనం




వ్యాపారాలను మొదలు పెట్టాలన్న విధంగా కొన్ని కఠినమైన నిర్ణయాలు, దృఢ సంకల్పం చేసుకుంటారు. ఆస్తులకు సంబంధించి అయినవాళ్లతో పోరాటం చేయాలన్న ఉద్దేశం కానీ మనస్తత్వం కానీ ఉండదు. ఈ నేపథ్యంలో సమస్యలు ఉత్పన్నమయ్యే పరిస్థితులు గోచరిస్తున్నాయి. నూతన వాహనం కొనుగోలు చేయాలని ఆలోచిస్తారు. పాత వాహనాన్ని తెలిసిన వారికి అమ్మేయాలని అనుకుంటారు.

ఈ వారం కా'ర్టూన్స్'


నాదీ దసరా వేషమే!!


ఈ విల్లాలు కట్టి అమ్మింది నేనే.. వాటిని కూల్చడానికి మీరు వాడుతున్న JCB లు అద్దెకిచ్చింది నేనే సర్!!
హైడ్రా ఆఫీసు.


మనిద్దరికీ పడదు కదా.. కావాలనే ఇలా ఆపోజిట్ డైరెక్షన్ లో వాకింగ్ చేస్తూ రౌండ్ రౌండ్ కు ఎదురొస్తున్నావు కదా....??
పార్కు



పర్యాటకులు అత్యధికంగా సందర్శించే ప్రదేశంగా లూరే కేవ్స్ పేరు గాంచాయి. తూర్పు అమెరికా వర్జీనియా రాష్ట్రంలోని షెనాండో లోయలో వున్నాయీ గుహలు.

## ఫోటో ఫీచర్











